
# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 15-11-2024 ₹ 15/-








## ముస్లిమేతరులతో ప్రవక్త మహనీయులు (స) ఎలా ఉండేవారు?

గీటురాయి వారపత్రిక

**GEETURAI WEEKLY**



Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in



సంపుటి: 46 సంచిక: 46 హైదరాబాద్
శుక్రవారం 15 నవంబర్ 2024 రూ.15-00
12 జమాది ఉల్ ఊలా 1446 హిజ్రీ


**తొలిగీటు**

నీవు నీ కోసం ఇష్టపడేదే మానవులందరి కోసం ఇష్టపడు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**



Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at “Geeturai Graphics”, Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com


## అల్లాహ్‌నే వేడుకోవాలి



30

## లోపల...


| | | |
|---|---|---|
| మదరసాలకు ఊరట | ...... | 04 |
| ట్రంప్ !...... | | 05 |
| దేవుని బెబ్బులి!! - 54 | ...... | 08 |
| చరితార్థులు-2 : గులాం నబీ షవాల్ | ...... | 11 |
| మహాకవి అల్లామా ఇక్బాల్ | ...... | 12 |
| ముస్లిం ప్రాతినిధ్యం అత్యల్పం | ...... | 14 |
| తినడానికీ పద్ధతి ! | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| మతం-రూపం-ఆవశ్యకత | ...... | 20 |
| ఆకలితో ఉన్నారా?... అన్నం తినండి! | ...... | 23 |
| ముస్లిమేతరులతో ప్రవక్తమహనీయులు (స) ఎలా ఉండేవారు | ...... | 24 |
| స్వేచ్ఛ అంటే? | ...... | 28 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| జవాబుదారీతనం ఉన్నతికి మార్గం | ...... | 34 |


**జమాత్ మహా సభలు**



అంగరంగ వైభవంగ
జె.ఐ.హెచ్ సభలు
హైద్రాబాద్ నగరంలో
వెలుగు జ్ఞాన ప్రభలు!
మానవాళికంతటికీ
విజ్ఞానపు వెలుగులు
దశదిశలా విస్తరించు
సందేశపు సౌరభాలు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

## ఆలోచన

# మదరసాలకు ఊరట

**ఉత్తరప్రదేశ్‌లో** 16 వేల సంఖ్యలో ఉన్న మదరసాలకు పెద్ద ఊరట లభించింది. ఈ కేసు వివరాలను పరిశీలించడం ఈ సందర్భంగా ఎంతైనా అవసరం. ఉత్తరప్రదేశ్‌లో 2004లో అప్పటి ప్రభుత్వం ఉత్తరప్రదేశ్ "బోర్డ్ ఆఫ్ మదరసా ఎడ్యుకేషన్" చట్టం చేసింది. అప్పట్లో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ములాయంసింగ్ యాదవ్. ఈ చట్టం ఎందుకు చేశారంటే ఉత్తరప్రదేశ్‌లో అనేక మదరసాలున్నాయి. వాటన్నింటిలో నాణ్యమైన విద్య బోధించేలా, అర్హులైన ఉపాధ్యాయులను నియమించేలా, పరీక్షలు సక్రమంగా జరిగేలా చూడడానికి ఈ చట్టం చేశారు. కేంద్రంలో పి.వి.నరసింహారావు ప్రభుత్వం ఉన్నప్పుడు కూడా మదరసాల్లో విద్యాప్రమాణాల నాణ్యత పెంచడం అవసరమని గుర్తించారు. నిజానికి ముస్లిములే కాదు అనేకమంది ముస్లిమేతరులు, ప్రముఖులు కూడా మదరసాల్లో చదువుకున్న కొన్ని ఉదాహరణలున్నాయి. కేంద్ర ప్రభుత్వం 2020లో పార్లమెంటులో చెప్పిన వివరాల ప్రకారం దేశంలో 24,010 మదరసాలున్నాయి. ఇందులో 60 శాతం మదరసాలు ఉత్తర ప్రదేశ్‌లోనే ఉన్నాయి. ఈ మదరసాల్లో నాణ్యమైన విద్య కోసం 2004లో ఆ చట్టం చేశారు. ఆ విధంగా ఉత్తరప్రదేశ్ బోర్డ్ ఆఫ్ మదరసా ఎడ్యుకేషన్ ఏర్పాటయ్యింది.

కాని దేశంలో కొన్ని శక్తులకు ముస్లిములకు సంబంధించిన ప్రతి విషయాన్ని వివాదాస్పదం చేయడం తప్ప మరో కార్యక్రమం లేని వాతావరణం చాలా కాలంగా కొనసాగుతోంది. అంషుమన్ సింగ్ రాథోడ్ అనే న్యాయవాది ప్రజాప్రయోజక వ్యాజ్యం ద్వారా ఈ చట్టాన్ని అలహాబాద్ హైకోర్టులో సవాలు చేశాడు. ఇది సెక్యులరిజానికి వ్యతిరేకం అన్నాడు. ఇలాంటి వ్యక్తుల దృష్టిలో సెక్యులరిజం అంటే కేవలం ముస్లిం వ్యతిరేకతే అని అర్ధమవుతోంది.

నిజానికి ఈ కేసు ప్రారంభం ఒక మదరసా పార్ట్ టైమ్ అసిస్టెంట్ టీచర్ తన సర్వీసు క్రమబద్దీకరణ కోసం వేసిన పిటీషన్‌తో అయింది. ఆ పిటీషన్‌ను విచారించిన అలహాబాద్ హైకోర్టు సింగిల్ జడ్జి లౌకిక రాజ్యాంగాన్ని అనుసరిస్తున్న దేశంలో ప్రత్యేక మతానికి సంబంధించిన వ్యక్తులుండే విద్యాబోర్డు ఏమిటనే ప్రశ్న లేవనెత్తి, పిటీషన్‌ను విస్తృత ధర్మాసనానికి పంపించేశారు. అంటే కేసును మరింత సంక్లిష్టం చేసి వదిలేశారు. వివాదం కొనసాగే తలుపులు తెరుచుకున్నాయి. ఆ తర్వాత అంషుమన్ రాథోడ్ రంగంలోకి వచ్చి పిటీషన్ వేశాడు. కేసు విచారించిన ద్విసభ్య ధర్మాసనం అసలు మదర్సాల చట్టమే రాజ్యాంగ విరుద్ధమని తేల్చేసింది. అంతేకాదు రాష్ట్రంలో 16 వేలకు పైగా మదర్సాల్లో విద్యాభ్యాసం చేస్తున్న 17 లక్షల మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని చెప్పింది. ప్రభుత్వ పాఠశాలలు ఎంత గొప్పగా నిర్వహిస్తున్నారో ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. ఇంత మంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చే అవకాశం ఉందా? తర్వాత ఈ తీర్పును సవాలు చేస్తూ పలువురు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. మరోవైపు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కూడా మదరసా చట్టానికి వ్యతిరేకంగా ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యింది.

ఇక్కడ గమనించవలసిన విషయమేమిటంటే, మదరసాలు దేశంలో శతాబ్దాలుగా నడుస్తున్నాయి. జ్ఞాన పరిమళాన్ని మారుమూల ప్రాంతాల వరకు కూడా మదరసాలు చేరవేశాయి. కాని మదరసాలు కేవలం మతవిద్యను మాత్రమే అందిస్తాయనే ఒక ప్రచారంతో మదరసాలను అప్రతిష్ఠపాలు చేసే ప్రయత్నాలు ఎప్పటి నుంచో జరుగుతున్నాయి. ఈ ప్రయత్నాల నేపథ్యంలో అలహాబాద్ హైకోర్టు తీర్పు మదరసాల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేసింది. ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు ఈ చీకట్లను కొంతవరకు తొలగించింది. దేశంలో సెక్యులర్ స్ఫూర్తిని, అలాగే దేశంలో మైనారిటీ వర్గాల హక్కులను, ముఖ్యంగా విద్యారంగంలో మైనారిటీలకు తమ ప్రత్యేక గుర్తింపును, ధార్మిక విద్యను కొనసాగించే హక్కును ఈ తీర్పు ప్రధానంగా నొక్కి చెప్పింది దీంతో మదర్సాల నిర్వాహకులు తాత్కాలికంగానయినా ఊపిరి పీల్చుకున్నారు. ✤

## కవరు కథనం

అబ్దుల్ వాహెద్



# ట్రంప్!

**అమెరికా అధ్యక్ష** ఎన్నికల ప్రచారంలో పూర్వ అధ్యక్షుడు బరాక్ ఒబామా కమలా హ్యారిస్‌కు పూర్తి మద్దతు ప్రకటిస్తే, ఎలాన్ మస్క్ డొనాల్డ్ ట్రంప్‌కు అసాధారణ సహాయం అందించాడు. ట్రంప్‌పై హత్యాయత్నాలు జరిగాయి. హ్యారిస్, ట్రంప్ మద్దతు దారుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి.

న్యూయార్క్ టైమ్స్ ప్రకారం, సుమారు 3,700 అణ్వాయుధాలను ప్రయోగించే అధికారం అధ్యక్షుడికి ఉంది. బైడెన్ 88 ఏళ్ల వయస్సు, ట్రంప్ 77 ఏళ్ల వయస్సు ... కాబట్టి ఓటర్లు జాగ్రత్తగా ఎన్నుకోవాలని ఆ పత్రిక సూచించింది. అంటే పరోక్షంగా 60 ఏళ్ల వయస్సున్న హ్యారిస్‌నే ఎన్నుకోవాలని చెప్పడం. ట్రంప్ ఒంటెద్దు పోకడలు చాలా మందికి నచ్చవు. కాని ఒక బిజినెస్ మ్యాన్‌గా ట్రంప్ నిర్ణయాల పట్ల చాలా మంది ఓటర్లలో సాను కూలాభిప్రాయం ఉన్నట్లు కూడా ముందుగానే తెలియవచ్చింది. బైడెన్ విషయంలో చాలా మందికి ప్రతికూలాభిప్రాయమే ఉంది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పట్ల బైడెన్ ఎంతో స్నేహభావాన్ని ప్రదర్శించినప్పటికీ, భారత్ – అమెరికా సంబంధాలు బైడెన్ కాలంలో బలహీనమయ్యాయి. ప్రధాన కారణం కెనడాకు మద్దతుగా అమెరికా నిలబడడం. ఈ నేపథ్యంలో అమెరికా న్యాయ శాఖ భారత ప్రభుత్వ ఉద్యోగులపై అభియోగాలు ప్రకటిం చింది. ఇప్పుడు ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత కెనడా విషయంలో అమెరికా వైఖరి ఎలా ఉంటుందో వేచి చూడాలి.

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికైన తర్వాత భారతదేశంతో అమెరికా సంబంధాలు, మధ్యప్రాచ్యంలో అమెరికా వైఖరి, ఉక్రెయిన్ యుద్ధం ఇలాంటి అనేక విషయాల్లో అమెరికా వైఖరి గురించి చర్చలు ప్రారంభమయ్యాయి.

తాజా భారత్–చైనా ఒప్పందం అమెరికాకు నచ్చే ఒప్పందం కాదు. ఈ ఒప్పందం విషయంలో ట్రంప్ ఎలా ప్రతిస్పందిస్తారో చూడాలి. భారత్–చైనా ఆర్థిక సహకారం అమెరికాకు నచ్చదు.

బ్రిక్స్ ఇప్పుడు చాలా బలపడింది. ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, UAE దేశాలతో చేరడంతో BRICS ప్రపంచ జనాభాలో 45 శాతానికి ప్రాతినిథ్యం వహిస్తోంది. ప్రపంచ GDPలో 35% బ్రిక్స్ దేశాలదే. G -7 జిడిపి 29%తో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. BRICS వేగంగా విస్తరిస్తోంది, స్థానిక కరెన్సీల

వినియోగాన్ని ప్రోత్సహించడానికి బ్లాక్‌చైన్ ఆధారిత BRICS పే సిస్టమ్ తీసుకువస్తున్నారు. 193 దేశాలలో 159 దేశాలు సంతకం చేసినట్లు తెలుస్తోంది. BRICS కరెన్సీ గురించి కూడా చర్చ జరుగుతోంది. భారత్ - చైనా ఆర్థిక సమన్వయం విషయంలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. పశ్చిమ దేశాల ఆర్థిక ఆధిపత్యానికి BRICS సవాలు విసురుతోంది. బ్రిక్స్ లో ఇప్పుడు భారతదేశం ముఖ్యమైన దేశం.

అమెరికాలో సుమారు 2.1 మిలియన్ మంది భారతీయ అమెరికన్ ఓటర్లున్నారు. ఎన్నికల ప్రచారంలో ట్రంప్ హిందువుల పక్షాన మాట్లాడి తన పక్షాన తిప్పుకోవడంలో కొంత విజయం సాధించారు. కాని సుమారు 8 లక్షల మంది భారతీయులు అమెరికాలో అక్రమ వలసదారులుగా ఉన్నారని తెలుస్తోంది. వీళ్ళందరినీ వెనక్కు పంపాలని ట్రంప్ భావిస్తున్నారు. డాలర్‌ను వ్యతిరేకించేవారిపై కూడా మండిపడ్డారు. నిషేధాలు, ఆంక్షలు విధిస్తామని హెచ్చరికలు చేశాడు. కాని అమెరికా నిషేధాలు పశ్చిమ దేశాలనే ఎక్కువగా నష్టపరిచాయి. ఆంక్షలు ఈరాన్ ను బలహీనపరచలేకపోయాయి. రష్యా శక్తిని తగ్గించలేకపోయాయి.

భారతదేశానికి, చైనాకు మధ్య ఉద్రిక్తతలు, వివాదాలు రగులుతూ ఉండాలని అమెరికా కోరుతున్నట్లు చాలా మంది విశ్లేషిస్తున్నారు. ట్రంప్ భారతదేశం నుండి దిగుమతులపై సుంకాల విషయంలో ఎలా వ్యవహరిస్తారన్నది కూడా చూడాలి. గతంలో ఆయన వైఖరి భారతదేశానికి అనుకూలంగా లేదు. ఏది ఏమైనా ట్రంప్ ఎన్నిక వల్ల అమెరికా విధానపరంగా భారతదేశానికి ఎంతవరకు సానుకూలంగా ఉంటుందన్నది వేచి చూడాలి.

అమెరికా అధ్యక్ష పదవికి తాను ఎన్నికైతే రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని 24 గంటల్లో ముగిస్తానని, తాను ఓడిపోతే ఇజ్రాయెల్ "నాశనం" అవుతుందని, చైనా దిగుమతులపై భారీగా కొత్త సుంకాలు విధిస్తానని తన ప్రచారంలో ట్రంప్ చెప్పిన విషయాలు కూడా ఇప్పుడు చర్చకు వస్తున్నాయి. ట్రంప్ విదేశాంగ విధానం ఇప్పుడెలా ఉంటుందన్నది ముఖ్యమైన ప్రశ్నగా మారింది.

రిపబ్లికన్ విదేశాంగ విధానం ఎలా ఉంటుందన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్న. ట్రంప్ వ్యక్తిత్వం, బలమైన నాయకుడనే గుర్తింపు వల్ల విదేశీ సంబంధాల్లో తనకు అనుకూలంగా విదేశీ నేతలను మార్చుకోగలరనే అభిప్రాయం ఉంది. ప్రపంచంలో చాలా సంక్షోభాలకు అధ్యక్షుడు జో బైడెన్ బలహీనతే కారణమని ట్రంప్ మద్దతుదారులు వాదిస్తున్నారు. కాని ట్రంప్ ఒంటెద్దు పోకడలు అమెరికా ప్రయోజనాలను కూడా దెబ్బతీయవచ్చనే భయాలు కూడా చాలా మందిలో ఉన్నాయి.

ట్రంప్ 2017 నుంచి 2021 వరకు మొదటిసారి అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలో "అమెరికా ఫస్ట్" విధానం అవలంబించారు. వేర్పాటు వైఖరి ముఖ్యంగా గమనించదగింది. NATO నుంచి వైదొలగుతానని చేసిన హెచ్చరికలు కూడా ఉన్నాయి. అయితే ఒప్పందాలు కుదుర్చుకునే వ్యాపారవేత్తగా ఉత్తర కొరియాతో సదస్సుల ప్రయత్నాలు కూడా చూశాం. కాని ఈ ప్రయత్నాలేవీ ఉత్తరకొరియా అణ్వాయుధ కార్యక్రమాన్ని ఆపలేక పోయాయి. అలాగే, ఇజ్రాయెల్‌తో అరబ్బు దేశాల సంబంధాలు మెరుగు పరచడానికి ఆయన కొన్ని ప్రయత్నాలు చేశారు. ఈ ప్రయత్నాలు కొంతవరకు సఫలం కావడానికి ముఖ్యకారణం అరబ్బు పాలకుల వైఖరి. ఇందులో ట్రంప్ ప్రదర్శించిన దౌత్యమేదీ లేదు.

"విదేశాంగ విధానానికి సంబంధించి డొనాల్డ్ ట్రంప్ అస్థిరంగా, అసంగతంగా వ్యవహరిస్తారని యూరోపియన్ కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్‌కు చెందిన విశ్లేషకులు అమెరికా ఎన్నికల ప్రచారం జరుగుతున్నప్పుడు ఒక బ్లాగ్ పోస్ట్‌లో రాశారు. ఒక విధంగా చూస్తే యూరోపు పట్ల ట్రంప్ వైఖరిలో సానుకూలత ఏదీ లేదు. ఆయన యూరోపియన్ యూనియన్ పట్ల, జర్మనీ పట్ల తీవ్ర వ్యతిరేకతే ప్రదర్శించారు.

రష్యా ఉక్రెయిన్ యుద్ధం విషయంలో ఆయన ఎలా స్పందిస్తాడన్నది ఇప్పుడు కీలకమైన విషయం. ఎందుకంటే ఆయన గతంలో నాటో పట్ల పెద్దగా ఆసక్తి చూపించలేదు. బైడెన్ వచ్చిన తర్వాతనే ఈ దేశాలతో సంబంధాలు మెరుగయ్యాయి. ఇప్పుడు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ట్రంప్‌ను సోషల్ నెట్‌వర్క్ Xలో అభినందించాడు.

ట్రంప్ గత సంవత్సరం ఒక సందర్భంగా మాట్లాడుతూ, "రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ 2022లో ఉక్రెయిన్‌పై దాడి చేయకుండా ఉన్నాడంటే దానికి కారణం తాను వైట్ హౌస్‌లో ఉండడమే" అన్నాడు. తాను 24 గంటల్లో యుద్ధాన్ని ఆపేస్తానని చెప్పాడు. కాని ఎలా ఆపుతాడో చెప్పలేదు. బలమైన నేతలుగా పేరుతెచ్చుకునే క్రమంలో చాలా మంది నాయకులు ఇలాంటి మాటలు చెప్పడం మామూలే.

ఉక్రెయిన్‌కు బైడెన్ మాదిరిగా ట్రంప్ మద్దతు ఇచ్చే అవకాశాలు లేవని చాలా మంది అంటున్నారు. నాటో విషయంలో అమెరికా పునరాలోచించాలన్నది ఆయన వైఖరి. నాటో విస్తరణపై దృష్టి పెట్టిన బైడెన్ వైఖరికి పూర్తి వ్యతిరేకమైన వైఖరి ట్రంప్ కలిగి ఉన్నాడు. బహుశా అమెరికా నుంచి ఉక్రెయిన్‌కు మద్దతు ఆగిపోవచ్చని చాలా మంది భావిస్తున్నారు. నిజానికి రష్యా ఉక్రెయిన్ యుద్ధం వల్ల అమెరికా పాశ్చాత్యదేశాలు కూడా చాలా నష్టపోయాయి. ఈ నష్టాన్ని ఆపడానికి ట్రంప్ ఎలాంటి ప్రయత్నాలు చేస్తారో వేచి చూడాలి.

మధ్యప్రాచ్యంలో పరిస్థితి ట్రంప్ ఎన్నిక తర్వాత ఏ మలుపు తిరుగుతుందన్నది మరో ముఖ్యమైన ప్రశ్న. గాజాపై, లెబనాన్‌పై ఇస్రాయీల్ దాడులు చేస్తోంది. ఇరాన్‌తో యుద్ధం జరుగుతోంది. హూతీలు ఎర్రసముద్రంలో వాణిజ్య నౌకలపై విరుచుకుపడు తున్నారు.

హమాస్‌ను నాశనం చేయడానికి ఇస్రాయీల్ యుద్ధం చేస్తుంది కాబట్టి తన మద్దతు పూర్తిగా ఇస్రాయీల్‌కు ఉంటుందని ట్రంప్ అన్నాడు. నెతన్యాహుకు ట్రంప్‌కు మధ్య మంచి సంబంధాలున్నాయి. ఈరాన్ పట్ల ట్రంప్‌కు చాలా వ్యతిరేకత ఉంది. కాబట్టి ఇస్రాయీల్‌కు మరింత సహాయం లభించవచ్చు. ఈరాన్‌తో ఇస్రాయీల్ యుద్ధం ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి. అమెరికా అధ్యక్ష భవనం నుంచి లభించే మద్దతుతో నెతన్యాహు తీసుకునే నిర్ణయాల ప్రభావం ఇస్రాయీల్ పౌరులపై ఎలా ఉంటుందనేది మరో ఆసక్తికరమైన విషయం.

ఇరాన్ అణ్వాయుధ ఒప్పందాన్ని ట్రంప్ వదిలేశాడు. అప్పటి నుంచి ఈరాన్ అణ్వాయుధ కార్యకలాపాలు కొనసాగిస్తూనే ఉంది. ఇప్పుడు ఈరాన్ వద్ద అణుబాంబు ఉందనే అనుమానాలు బలంగా ఉన్నాయి. ఇప్పుడు ఈరాన్‌తో వ్యవహరించడం ట్రంప్‌కు అంత సులభం కాదు. బలహీనంగా ఉన్నప్పుడే ఈరాన్ ట్రంప్‌ను లెక్క చేయలేదు. ఇప్పుడు మిస్సయిల్ పవర్‌గా మారిన ఈరాన్ ట్రంప్ చప్పుళ్ళకు భయపడుతుందా అన్నది ఆసక్తికరమైన ప్రశ్న.

ట్రంప్ వైట్ హౌస్‌లో ఉన్నప్పుడే ఇస్రాయీల్, యూఏఈ, బహ్రెయిన్‌ల మధ్య అబ్రహామ్ ఒప్పందం జరిగింది. కాని ఈ ఒప్పందం వల్ల పాలస్తీనాకు ఒరిగింది ఏదీ లేదు. ట్రంప్ రావడం వల్ల సౌదీతో దిగజారిన సంబంధాలు కాస్త మెరుగయ్యే అవకాశాలున్నాయి. కాని సౌదీ పాలకులు ప్రజాగ్రహాన్ని పట్టించుకోకుండా ఇస్రాయీల్‌కు బాహాటంగా మద్దతిచ్చే అమెరికా వైపు పూర్తి మొగ్గు చూపిస్తారా అన్నది ప్రశ్నార్థకమే. ఈరాన్‌తో సౌదీ సంబంధాలపై ట్రంప్ ఎలాంటి ప్రభావం వేస్తారో వేచి చూడాలి.

ట్రంప్ విజయం సాధించాలని నెతన్యాహు బాహాటంగా కోరుకున్నాడు. ఆయన కోరినట్లే ట్రంప్ అధికారంలోకి వచ్చాడు. అమెరికాలో ఎన్నికలను ఎదుర్కొంటున్న బైడెన్ ఇస్రాయీల్ పై ఎలాంటి ఒత్తిడి తీసుకురాలేదు. నిజానికి నెతన్యాహు వైఖరి పట్ల బైడెన్ ప్రభుత్వం తీవ్రమైన ఆగ్రహమే కలిగి ఉండేది. ముఖ్యంగా గాజాకు సహాయాన్ని అడ్డుకోవడం, ఐక్యరాజ్య సమితికి వ్యతిరేకంగా ప్రచారం, బందీల విడుదలకు ప్రయత్నాలపై నెతన్యాహు వైఖరి మొదలైన విషయాలు బైడెన్‌కు తలనొప్పిగానే ఉండేవి.

ఏడాదికి పైబడి కొనసాగుతున్న గాజా యుద్ధంలో బైడెన్ ప్రభుత్వం ఇస్రాయీల్‌కు కోపం రాకుండా చూసుకోవాలనే వైఖరినే అవలంబించింది. అరబ్బు అమెరికన్లు కమలా హ్యారిస్‌కు వ్యతిరేకంగా ఓటు వేయడానికి ఇదే ముఖ్యమైన కారణం. ఇప్పుడు ట్రంప్ ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ Unrwaకు వ్యతిరేకంగానే వ్యవహరిస్తుందని అందరూ భావిస్తున్నారు. ట్రంప్ 2018లో ఈ సంస్థకు నిధులు ఆపేసిన చరిత్ర కూడా ఉంది.

ట్రంప్ తిరిగి రావడం వల్ల ఇస్రాయీల్‌కు మద్దతు పెరగవచ్చు. పైగా ట్రంప్ కు ఇప్పుడు ఎన్నికల భయం లాంటిది ఏదీ లేదు. కాని ట్రంప్ అధికారంలోకి రావడం వల్ల నెతన్యాహు ఇంకా రెచ్చిపోతాడా? అనే ప్రశ్నకు జవాబు అంత తేలిక కాదు. ఇప్పుడు ఎన్నికలు లేవు కాబట్టి బైడెన్ మాదిరిగా భయపడవలసిన అవసరం ట్రంప్‌కు లేదు. అందువల్ల యుద్ధవిరమణ విషయంలో నెతన్యాహుపై ఒత్తిడి తీసుకువచ్చే అవకాశాలున్నాయి. అయితే ఈ యుద్ధవిరమణ ఒప్పందంలో ఇస్రాయీల్‌కు అత్యధిక ప్రయోజనాలు లభించేలా చేయడానికి ప్రయత్నించవచ్చు. కాని ఈరాన్ విషయంలో ట్రంప్ వ్యతిరేకతను ఉపయోగించుకుని నెతన్యాహు యుద్ధాన్ని మరింత పొడిగించే అవకాశం ఉంది. ఈరాన్ పై దాడులు చేసి అణ్వస్త్ర సామర్థ్యాన్ని దెబ్బతీస్తానని ట్రంప్‌ను ఒప్పించడానికి నెతన్యాహు ప్రయత్నించవచ్చు. ఈరాన్ పట్ల వ్యతిరేకత ఉన్నప్పటికీ ఇప్పుడు ఈరాన్‌కు దగ్గరైన సౌదీ కూడా మరోసారి ఈరాన్‌కూ దూరమయ్యే పరిస్థితులు రావచ్చు. ఎందుకంటే సౌదీ రాజకుటుంబానికి ట్రంప్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి.

కాని పాలస్తీనాలో నరమేధానికి పాల్పడిన ఇస్రాయీల్ పట్ల సౌదీ రాజకుటుంబం మెతకవైఖరి చూపిస్తే సౌదీ ప్రజల్లో వ్యతిరేకత పెరగకుండా అడ్డుకోవడం కష్టమే. మరోవైపు అమెరికా బెదిరింపులను ఏమాత్రం లక్ష్యపెట్టక దాడులు కొనసాగిస్తున్న హూతీలను అదుపు చేయడం కూడా ట్రంప్ అనుకున్నంత సులభం కాదు. లెబనాన్‌లో హిజ్బుల్లా శక్తి ఎలాంటిదో ఇస్రాయీల్ ఇప్పటికే చవి చూసింది. ఈ యుద్ధంలో ఇస్రాయీల్ సైనికంగా కూడా చాలా నష్టపోయిందనే వార్తలు వస్తున్నాయి. మరోవైపు ఈరాన్ తన బలాన్ని స్పష్టంగా ప్రదర్శిస్తుంది. ఈరాన్ పై దాడి చేయడానికి ఇస్రాయీల్ మీనమేషాలు లెక్కపెట్టే పరిస్థితి ఉంది. రష్యా, చైనా, ఉత్తర కొరియాలు కూడా ఇందులో తమ పాత్ర పోషిస్తున్నాయి. వీటన్నింటి నేపథ్యంలో ఆలోచిస్తే ఇప్పుడున్నది ఏకధృవ ప్రపంచం కాదు. ఒక వ్యాపారవేత్తగా మాత్రమే ఆలోచించే ట్రంప్ చేసుకునే డీల్స్ ఇంతకు ముందు ఉత్తర కొరియా విషయంలో విఫలమయ్యాయి. ఇప్పుడు ఈరాన్ విషయంలో ఏం చేస్తారో వేచి చూడాలి. ✤

అధ్యాయం -20

54

## 1. జ్ఞాన ఖని!

# దేవుని బెబ్బులి!!

ఎస్.ఎమ్. మలిక్

## 1. మహనీయ అలీ(ర)

### విచారణ విధానం

అదొక హత్యకు సంబంధించిన కేసు. కొందరు ప్రయాణీకులు తిరిగి వచ్చారు. వారిలో తన తండ్రి లేరని ఓ యువకుడు ఫిర్యాదు చేశాడు మహనీయ అలీ(ర) వద్ద. ఆ వ్యక్తి మరణించినట్లు, అతని వద్ద సొమ్ము ఏదీ లేక పోయినట్లు, మిగతా ప్రయాణికులు చెబుతున్నారన్నది, ఆ కేసు న్యాయస్థానంలో వేస్తే అక్కడ వారు తప్పించుకున్నారన్నది ఫిర్యాదు. మహనీయ అలీ(ర) పోలీసుల్ని పిలిపించి ఆ ప్రయాణికులపైన నిఘా ఏర్పాటు చేసి వారు ఒకరినొకరు కలసుకోకుండా చేశారు.

ఆ పైన వారిలో ఒక్కొక్కరినే పిలిపించి మృతుని గురించి వాంగ్మూలం వ్రాయించడం మొదలెట్టారు. ఆ వ్యక్తికి సంబంధించిన ప్రశ్నలన్నింటికీ సమాధానాలు అడిగి తెలుసుకున్నారు. ఒక్కో వ్యక్తి వాంగ్మూలం ముగిసిన తరువాత, "అల్లాహు అక్బర్" అన్న నినాదం చేశారు. వారు తమ వాంగ్మూలాన్ని స్వీకరించడం జరిగిందని భ్రమ పడ్డారు. వాంగ్మూలం ముగిసిన తరువాత ప్రతి ఒక్కరిని ఖైదులో బంధిస్తూ పోయారు. అందరి వాంగ్మూలాలు పరిశీలిస్తే అన్నీ వేర్వేరుగా ఉన్నాయి. తిరిగి ఒక్కొక్కరినే రప్పించి, "నిజం చెప్పు, నీ మిగిలిన మిత్రులు మరో మాట చెబుతున్నారు" అని బెదరించగానే ఒక్కొక్కరే నిజం కక్కేశారు. వారు ఆ వ్యక్తిని చంపివేసి అతని సొత్తు దోచుకున్నారు. వారి నుండి దోచుకున్న సొమ్ము రాబట్టి హత్యా పరిహారమూ గ్రహించడం జరిగింది.

### మహనీయ అలీ(ర) సూక్తులు కొన్ని

- రే ప్రార్థన ద్వారా విశ్వాసికి జ్యోతి కాంతి ప్రాప్తమవుతాయి.
- ధార్మికతలో శుభం భయభక్తుల వల్ల లభిస్తే, పేరాశ దురాశల వల్ల చెరుపు ప్రాప్తిస్తుంది.
- తన జ్ఞానాన్ని అమలుపరచి సద్వినియోగం చేసుకున్న వాడు ధన్యుడు.
- ఆంతర్యం కఠినమవడానికి మూలం కడుపు నిండా భుజించడం.
- మానవ ఔన్నత్యం నైతికత, మర్యాదల్లో ఉంటుంది, వంశావళిలో కాదు.

- నైతిక సౌందర్యం శారీరక సౌందర్యం కన్నా ఉత్కృష్టమయినది.
- సద్వర్తన సహజంగానే అత్యుత్తమ సంపద.
- ఒకరి పట్ల అమర్యాదగా ప్రవర్తించిన వారికి ఔన్నత్యం ప్రాప్తం కాదు.
- తిరుగుబాటుదారు కత్తి అతనినే సంహరిస్తుంది.
- ఉపకారం నోరు మూయిస్తుంది.
- నోరు తీయనిదయితే ఊరంతా మిత్రులు.
- నీకు ఇష్టమయిన దాన్నే ఎదుటివానికీ ఇష్టపడు. నీ శిక్షణకు ఇది చాలు.
- చెప్పిందెవరో అని కాదు, చెప్పిందేమిటో గమనించు.
- ఇతరుల కొరకు మేలయిన వాడే ఉత్యుత్తమ మానవుడు.
- వ్యక్తిత్వం నోటి వెనక దాక్కుని ఉంటుంది.
- ఆపదలో సహకరించే వాడే నీ నిజమయిన మిత్రుడు.
- దైవం నిన్ను స్వేచ్ఛాజీవిగా పుట్టించాడు, ఎవరి దాస్యమూ స్వీకరించకు.
- జనులు నిద్రపోతూ ఉంటారు, మరణించగానే కళ్ళు తెరచుకుంటాయి.
- తన విలువ తెలిసిన వ్యక్తి ఎన్నటికీ వృధా కాడు.
- ఒక్కోసారి ఒక్క మాటే నీ శుభాన్ని దోచుకుంటుంది.
- నైతికతా మర్యాదలు సరికొత్త దుస్తుల వంటివి, ఆలోచనలు అద్దం వంటివి.
- పరాయి చోట మనిషి తన మాట ముందుంచ లేడు, నిరుపేద తన చోట కూడా కొత్తవాడే.
- నగుమోము దైవానుగ్రహం.
- శక్తి ఉన్నా ఒకరి తప్పును మన్నించడం ఆ శక్తికి దైవ కృతజ్ఞతలు తెలపడంతో సమానం.
- మన్నింపుకై మళ్ళీ వేడుకోవడం, పాపాన్ని జ్ఞాపకం చేయడంతో సమానం.
- మృత్యువును గుర్తు చేసుకోవడం ఆంతర్యాల ప్రక్షాళన.
- హృదయం పాత్ర వంటిది. ఉత్తమ పాత్ర జ్ఞానాన్ని కాపాడి పెట్టేది.

★★★

- ప్రపంచం ఎవరినయినా ఆశ్రయిస్తే ఇతరుల మంచిని కూడా అతనికి కూడబెడుతుంది, ముఖం ముడుచుకుంటే అతని స్వంత శుభాలనూ దోచుకుంటుంది.
- మనసు కాంక్షా ప్రియమయినది. ఆటపాటలను కోరుతుంది, విశ్రమాన్ని అభిలషిస్తుంది, చెడును ప్రేరేపిస్తుంది, పాపం వైపునకు మొగ్గుతుంది. దాన్ని బలవంతం చేస్తే అలసిపోతుంది, వదలిపెడితే వృధాపోతుంది - మధ్యే మార్గం అవలంబించు.
- తన సద్వర్తనను అల్పమయినదని, దాచదగినదని, ఆచరణకు వేగిర పడవలసినదని భావించండి.
- ఉత్తమ నైతికత, ఉన్నత గుణగణాలు, ఉదార స్వభావాలలోనే దేవుని ఉపాధి ఖజానాలు ఉన్నాయి.
- జనులు మూడు విధాలుగా ఉంటారు 1. దైవజ్ఞనులయిన పండితులు. 2. జ్ఞాన జిజ్ఞాస గలవారు. 3. కాపరి లేని పశువుల మంద, అది ప్రతి శబ్దం వెనకాల పరిగెడుతూ ఉంటుంది. ఒక్క గాలి ఊపుతో పడిపోతుంది. అటువంటి వారు జ్ఞాన జ్యోతి ద్వారా కాంతిని ఆఘ్రాణించరు లేదా పటిష్టమయిన స్తంభాన్ని ఆశ్రయించరు.
- జ్ఞాన సంపన్నులయిన వారి నుంచి జ్ఞానాన్ని పంచిపెడతామన్న ప్రమాణం చేయించుకోనంత వరకు, అల్లాహ్, మూఢ జనం నుంచి జ్ఞానం తప్పక పొందగలమని ప్రమాణం చేయించుకోలేదు.
- శుభం అన్నది మీ వద్ద ధనం, సంతానం మెండుగా ఉండటంలో లేదు, నిజమయిన శుభ శ్రేయాలు మీ జ్ఞాన సంపద వృద్ధి చెందడంలో ఉన్నాయి, సహన సంయమన భావాలు సమృద్ధి కావడంలో ఉన్నాయి, ఇంకా శుభం కొరకు దైవ ధ్యానం వల్ల నీ ఆంతర్యంలో ఆనందం చోటు చేసుకోవాలి,సత్కార్యం చేసి దైవ స్తోత్రం చేయాలి, ఏదయినా తప్పు జరిగితే దైవం సమక్షంలో మన్నింపును అర్థించాలి.
- తన వల్ల పాపం జరిగి దాని పట్ల పశ్చాత్తాపంతో దైవం వైపునకు మరలి క్షమాపణ అర్థించే వ్యక్తి, లేదా శుభ కార్యాల్లో ఆలస్యం చెయ్యకుండా వేగిర పడే వ్యక్తి, ఈ ఇరువురిలో ఏ ఒక్కరిలోనయినా శుభం మిగిలి ఉన్నంత వరకు ప్రపంచంలో శుభం మిగిలి ఉంటుంది.

✤ జనులు జ్ఞాన సముపార్జన పట్ల మొగ్గు చూపరు, కారణం, జ్ఞానవంతులు(పండితులు) జ్ఞానం ద్వారా సరయిన ప్రయోజనం పొందటం లేదు.

✤ అధికంగా నమాజులు ఆచరించేవారు, ఉపవాస వ్రతాలు పాటించేవారు, సమర రంగంలో కృషి చేసే వారికన్నా మహత్తు గలవారు ధర్మజ్ఞులు. ధర్మజ్ఞులు నిష్క్రమిస్తే ధర్మంలో ఓ నెర్ర ఏర్పడుతుంది, దాన్ని అతని వంటి ధర్మజ్ఞుడే పూడ్చగలడు.

✤ ఒక ముస్లిమ్ సోదరుని ఆనందం కొరకు ఏదయినా ఏర్పాటు చేస్తే, దేవుని మన్నింపు క్షమాభిక్ష ప్రాప్తమవుతాయి.


✤ మూడు ఆచరణలు అత్యంత కష్ట సాధ్యమయినవి, ఒకటి, ఎదుటి వ్యక్తి హక్కు అతనికి అప్పజెప్పడం. రెండు, సర్వావస్థల్లో (సుఖ దుఖాల్లో, కలిమి లేముల్లో, ఆహ్లాదంలో ఆపదల్లో) దైవస్తోత్రం చెల్లించడం. మూడు, తన ధనం ద్వారా ఇతరుల పట్ల సానుభూతితో సహాయ పడటం.

✤ నిజమయిన న్యాయమూర్తిలో అయిదు విశేషాలు తప్పనిసరి : 1. పరిశుద్ధ వ్యక్తిత్వం. 2. సంయమనం పాటించ గలగడం. 3. గతంలో జరిగిన తీర్పుల జ్ఞానం కలిగి ఉండటం. 4. వివేక వంతులతో సంప్రతించడం. 5. దైవం విషయంలో నిందించేవాని నిందలకు భయ పడక పోవడం. **(సమాప్తం)**

# తెలుగు విశ్వవిద్యాలయం "సాహితీ పురస్కారం" సయ్యద్ నశీర్ అహమ్మద్ ప్రతిభకు తార్కాణం



**ప్రముఖ చరిత్రకారులు,** బహుగ్రంథ రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్ రచించిన **"ఆజాద్ హింద్ ఫౌజ్ : ముస్లిం పోరాట యోధులు"** (484 పుటలు) చరిత్ర గ్రంథానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం "సాహితీ పురస్కారం" ప్రకటించింది. ఈ పురస్కారం క్రింద 20,116 రూపాయల నగదు, పురస్కార జ్ఞాపికను హైదరాబాద్, నాంపల్లిలోని విశ్వవిద్యాలయానికి చెందిన నందమూరి తారక రామారావు కళామందిరంలో నవంబరు 12వ తేదీన జరగనున్న పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో నశీర్ అహమ్మద్‌కు అందజేస్తామని విశ్వవిద్యాలయం సహాయ సంచాలకులు రామమూర్తి తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కె.వి. రమణాచారి (ఐఎఎస్), విశిష్ట అతిథిగా విశ్వవిద్యాలయం పూర్వపు ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్ రావు హాజరు కానున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రస్తుత ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్ రావు కార్యక్రమానికి అధ్యక్షత వహించనున్నారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిం జన సముదాయాలు నిర్వహించిన త్యాగమయ సాహసోపేత మహత్తర పాత్రను వివరిస్తూ నశీర్ అహమ్మద్ తెలుగులో 25 పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను రాసి వెలువరించారు. ఆయన రాసిన పలు గ్రంథాలు ఆంగ్లం, హిందీ, ఉర్దూ, కన్నడ, తమిళం, గుజరాతీ భాషలో అనువాదమయ్యాయి. చరిత్ర రచనా రంగంలో సయ్యద్ నశీర్ అహమ్మద్ కృషికి గుర్తింపుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2017లో ఆయనకు "కీర్తి పురస్కారం" అందజేసి సత్కరించింది. ప్రస్తుతం "సాహితీ పురస్కారం"తో నశీర్ అహమ్మద్‌ను తెలుగు విశ్వవిద్యాలయం మరో మారు గౌరవించటం పరిశోధనాత్మక చరిత్ర రచనా రంగాన నశీర్ ప్రతిభకు తార్కాణం. ✤




‘చరితార్థులు’-2



# గులాం నబీ షవాల్

## (1929-1946)

64






**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **‘చరితార్థులు’ - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

**భారతదేశం** అంతటా ప్రజ్వరిల్లిన 1942 నాటి ‘క్విట్ ఇండియా’ నినాద స్ఫూర్తితో, ఆంగ్లేయుల తొత్తుగా రాజరికం చేస్తున్న కశ్మీర్ సంస్థానాధీశుడు మహారాజా హరిసింగ్‌ను ‘క్విట్ కశ్మీర్’ అంటూ ఉద్యమం జమ్మూ-కశ్మీర్‌లో 1946లో ఉవ్వెత్తున ఎగిసిపడింది. ఆ ప్రజా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న గులాం నబీ షవాల్ 1929లో జమ్మూ-కశ్మీర్ లోని శ్రీనగర్‌లో జన్మించారు. ఆయన తండ్రిపేరు ఖాదిర్ షవాల్. ఆంగ్ల వలస పాలకుల ఉద్వాసనే లక్ష్యంగా సాగుతున్న జాతీయోద్యమం పట్ల చిన్నతనం నుండి ఆసక్తి పెంచుకున్న గులాం నబీ కశ్మీర్‌లోని ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా పరిమిత పరిధిలో ఉద్యమ కార్యక్రమాలలో పాల్గొన్నారు. భారత జాతీయ కాంగ్రెస్ 1942 ఆగస్టు తొమ్మిది నాటి బొంబాయి సమావేశంలో ‘క్విట్ ఇండియా’ ఉద్యమానికి పిలుపు ఇవ్వగానే ‘ఆంగ్లేయుల్లారా దేశం విడిచి పెట్టి వెళ్ళండి’ అంటూ ప్రజలు ఉద్యమించారు. ఆ సమయంలో ఆంగ్లేయుల వత్తాసుతో మహారాజా హరిసింగ్ జమ్మూ-కశ్మీర్ పాలన సాగిస్తున్నాడు. ఆయన పాలన స్థానంలో బాధ్యతాయుతమైన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ప్రజోద్యమానికి నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు షేక్ అబ్దుల్లా 1946 మే మాసంలో శ్రీకారం చుట్టారు. మహారాజా హరిసింగ్ నిరంకుశ రాజరిక పాలనను అంతమొందించాలన్న లక్ష్యంతో ‘క్విట్ కశ్మీర్’ నినాదం జమ్మూ-కశ్మీర్ అంతటా ప్రతిధ్వనించింది. ‘క్విట్ కశ్మీర్’ ఉద్యమానికి పండిత జవహర్ లాల్ పూర్తిస్థాయిలో మద్దతు తెలిపి ఆయన స్వయంగా జమ్మూ-కశ్మీర్‌కు విచ్చేసి క్విట్ కశ్మీర్ ఉద్యమకారులను ప్రోత్సహించారు. ఈ క్విట్ కశ్మీర్ ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటున్న గులాం నబీ షవాల్ మరింత ఉత్సాహంతో ఉద్యమించారు. ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించడంతో ఆగ్రహించిన మహారాజా హరిసింగ్ క్విట్ కశ్మీర్ ఉద్యమాన్ని అణచివేయడానికి ‘మార్షల్ లా’ ప్రకటించి తన పోలీసు-సైనిక బలగాలను ఉద్యమకారుల మీదకు ఉసిగొల్పాడు. ఆ మహోధృత ఉద్యమంలో గులాం నబీ షవాల్ క్రియాశీలకంగా పాల్గొని ‘క్విట్ కశ్మీర్’ అంటూ నినదిస్తుండగా మహారాజా హరిసింగ్ సైనిక బలగాలు తుపాకులను ఎక్కుపెట్టి కాల్పులు జరుపుతూ ఉద్యమకారుల మీద ఎగబడ్డాయి. ఆ భయానక లాఠీచార్జి, కాల్పులలో గులాం నబీ తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను ఆరెస్టు చేసిన పోలీసులు శ్రీనగర్‌లోని కారాగారంలో బంధించారు. ఆ బందిఖానాలో ఆయన మీద సాగిన భయంకర చిత్రహింసల పర్యవసానంగా 1946 అక్టోబర్‌లో గులాం నబీ షవాల్ అమరులయ్యారు. ఆనాటి ఆయన సాహసచర్య స్ఫూర్తిదాయకమయ్యేలా గులాం నబీ షవాల్ చిత్రపటం ఢిల్లీలోని ఎర్రకోటలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమర యోధుల చిత్రపటాల ప్రదర్శనశాలలో మనకు దర్శనమిస్తుంది. ✤

మదీహా అర్జుమంద్

# మహాకవి అల్లామా ఇక్బాల్



**భారత ఉపఖండ సాహితీ చరిత్రలో ఉర్దూ,** ఫార్శీ సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన అతి కొద్ది మంది కవుల్లో అల్లామా డాక్టర్ ముహమ్మద్ ఇక్బాల్ ప్రథములు. ఆయన రాసిన 'సారే జహా సె అచ్ఛా.. హిందూసితా హమారా..' దేశభక్తిగీతం నేటికీ భారతీయుల హృదయాలను పరవశింపజేస్తూ, దేశభక్తిని, దేశం పట్ల ప్రేమను ఉద్దీపింపజేస్తున్నది. అల్లామా అని బిరుదాంకితుడైన డాక్టర్ ఇక్బాల్ ప్రఖ్యాత కవి, రచయిత, తత్వవేత్త, సమర యోధుడు, రాజకీయ నాయకుడు. అల్లామా అంటే మహా కవి / మహా పండితుడు అని అర్థం. 1877, నవంబర్ 9వ తేదీన బ్రిటిష్ ఇండియాలోని సియాల్ కోట్‌లో ఇక్బాల్ జన్మించారు. తండ్రి షేఖ్ నూర్ ముహమ్మద్, చిన్నపాటి ప్రభుత్వ ఉద్యోగి. తరువాతి క్రమంలో సొంత వ్యాపారం ప్రారంభించాడు. తల్లి ఇమామ్ బీబీ. తల్లి తండ్రులిద్దరూ చాలా భక్తిపరులు. నిర్మల మనస్సు కలిగిన ధార్మిక వ్యక్తులు. అతి సాధారణ జీవితానికి అంకితమైనవారు. ఉర్దూ, ఫార్శీ భాషా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహాకవి డాక్టర్ ఇక్బాల్ ఆధునిక తాత్విక ఆలోచనాపరులు. ఇక్బాల్‌ను షాయిరె మష్రిఖ్ అని కూడా అంటారు. అంటే ప్రాచ్య కవి అని అర్థం. ఆయన్ని ముఫాకిరె పాకిస్తాన్ అనీ, హకీముల్ ఉమ్మత్ అని కూడా పిలుస్తారు. ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్‌లలో లాహోరీ ఇక్బాల్ గా ప్రసిద్ధి చెందారు. ఫార్శీ సాహిత్యంలో ఇక్బాల్ చేసిన కృషి బహుదా ప్రశంసనీయం. పాకిస్తాన్ ప్రభుత్వం ఆయన్ని జాతీయ కవిగా గుర్తించింది. విభిన్న సాహితీ ప్రక్రియల్లో డాక్టర్ ఇక్బాల్ కవిత్వం, కథలు రాశారు. ఆయన మొదటి కవితా సంపుటి అస్రారె ఖుదీ 1915లో ఫార్శీ భాషలో వెలువడింది. ఇతర కవితా సంపుటాలలో రమూజె బేఖుదీ, పయామె మష్రిఖ్, జబూరె అజం ఉన్నాయి. అలాగే ఆయన ప్రసిద్ధ ఉర్దూ రచనల్లో బాంగె దరా, బాలె జిబ్రీల్, జర్ బె కలీమ్, ఆర్మగానె హిజాజ్ తదితర గ్రంథాలు ప్రముఖమైనవి. షిక్వ, జవాబె షిక్వ పద్య రచన కూడా అత్యంత ప్రసిద్ధమైనది. లాహెూర్ ప్రభుత్వ కళాశాల తత్వశాస్త్ర అధ్యాపకుడు సర్ థామస్ ఆర్నాల్డ్ బోధనల ప్రభావం డాక్టర్ ఇక్బాల్‌పై చాలా ఉంది. ఆర్నాల్డ్ బోధనల ప్రభావంతోనే పశ్చిమ

దేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలని నిర్ణయించుకున్న ఇక్బాల్ 1905 లో ఇంగ్లాండుకు వెళ్ళారు. కేంబ్రిడ్జ్‌లోని ట్రినిటీ కళాశాల నుండి స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించారు. 1906 లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీ పొందారు. అదే సంవత్సరం లింకన్స్ ఇన్ నుండి బారిస్టర్ అయ్యారు. 1907లో డాక్టరేట్ చదవడానికి జర్మనీకి వెళ్లారు. 1908లో మ్యూనిచ్‌లోని లుడ్విగ్ మాక్స్ మిలియన్ విశ్వవిద్యాలయం నుండి పి. హెచ్.డి పట్టా పొందారు. ఫ్రెడరిక్ హొమెల్ మార్గదర్శకత్వంలో పని చేస్తూ, డాక్టర్ ఇక్బాల్ 1908లో 'ది డెవలప్‌మెంట్ ఆఫ్ మెటాఫిజిక్స్ ఇన్ పర్షియా.' పేరుతో తన డాక్టరేట్ థీసిస్‌ను ప్రచురించారు. ఐరోపాలో చదువుతున్నప్పుడే ఫార్సీ భాషలో చక్కని కవిత్వం రాయడం ప్రారంభించిన ఇక్బాల్, తన ఆలోచనల ధారను సులభంగా ప్రతిబింబింపజేయడానికి కవిత్వమే సరైన మాధ్యమమని భావించారు. 1899 లో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీని పూర్తి చేసిన తర్వాత, ఓరియంటల్ కాలేజీలో అరబిక్ రీడర్‌గా వృత్తిని ప్రారంభించారు. లాహోర్ ప్రభుత్వ కళాశాలలో తత్వశాస్త్రం బోధించడానికి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యారు. 1905 లో ఇంగ్లాండుకు వెళ్లే వరకు అక్కడే పనిచేశారు. 1908 లో ఇంగ్లండ్ నుండి తిరిగి వచ్చి మళ్లీ అదే కళాశాలలో తత్వశాస్త్రం, ఆంగ్ల సాహిత్య ప్రొఫెసర్‌గా చేరారు. ఫ్రెడరిక్ నీట్జే, హెన్రీ బెర్గ్ సన్, గోథే వంటి పాశ్చాత్య తత్వవేత్తల ప్రభావం కూడా ఇక్బాల్‌పై అమితంగా ఉంది. మౌలానా రూమీ కవిత్వం, తత్వశాస్త్రం ఇక్బాల్ మనస్సుపై లోతైన ప్రభావాన్ని చూపాయి. చిన్నతనం నుండి ధార్మిక భావాలు కలిగిన ఇక్బాల్ ఇస్లాం అధ్యయనం, ఇస్లామీయ నాగరికత, సంస్కృతి, చరిత్ర, రాజకీయం తదితర అంశాలపై దృష్టిపెట్టారు. రాజకీయ ఉద్యమంలో ప్రవేశించి, ముస్లిం లీగ్‌లో క్రియాశీలక పాత్ర పోషించారు. మౌలానా మొహమ్మద్ అలీ, ముహమ్మద్ అలీ జిన్నా వంటి ముస్లిం రాజకీయ నాయకులతో సన్నిహితంగా ఉన్నారు. జిన్నా నేతృత్వంలోని కాంగ్రెస్ ముస్లిం నాయకుల నుండి సైద్ధాంతిక విభేధాల వల్ల వేరుబడిన తరువాత, 1920 లలో లీగ్‌ను పీడించిన వర్గ విభేదాల కారణంగా ముస్లిం లీగ్ రాజకీయ నాయకుల పట్ల కూడా ఇక్బాల్ నిరాశకు గురయ్యారు. ముహమ్మద్ షఫీ, ఫజ్లుర్రహమాన్ వంటి నేతల పట్ల ఉన్న భ్రమలు తొలగిపోయ్యాయి. కేవలం ముహమ్మద్ అలీ జిన్నా మాత్రమే ఐక్యతను కాపాడగలడని, ముస్లిం రాజకీయ సాధికారతపై లీగ్ లక్ష్యాలను నెరవేర్చగల రాజకీయ నాయకుడని ఇక్బాల్ నమ్మారు. అందుకే జిన్నాతో బలమైన వ్యక్తిగత స్నేహ సంబంధం ఏర్పరచుకోవడం ద్వారా లండన్‌లో తన స్వయం ప్రవాసాన్ని ముగించి, భారత దేశానికి తిరిగి వచ్చి లీగ్‌కు నాయకత్వ బాధ్యతలు చేపట్టేలా ఒప్పించడంలో డాక్టర్ ఇక్బాల్ ప్రభావవంతమైన పాత్రను పోషించారు. భారతీయ ముస్లింలను లీగ్‌వైపు ఆకర్షించి, ఆంగ్లేయుల ముందు పార్టీని ఐక్యంగా ఉంచగల సామర్థ్యం ఉన్న ఏకైక నాయకుడు జిన్నా మాత్రమే అని ఇక్బాల్ గట్టిగా నమ్మారు. 1930, డిసెంబర్ 29 నాటి తన అధ్యక్ష ప్రసంగంలో ఇక్బాల్, వాయువ్య భారతదేశంలోని ముస్లిం ప్రాబల్య ప్రాంతాలన్నీ కలిపి ఒక స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేయాలన్న ఆకాంక్షను వ్యక్తపరిచారు. డాక్టర్ ఇక్బాల్ బ్రిటిష్ ఇండియాలోని ముస్లింల చారిత్రక, రాజకీయ, ధార్మిక, సాంస్కృతిక పత్రికకు మొదటి పోషకుడు. 1935 లో డాక్టర్ ఇక్బాల్ సూచన మేరకు, సయ్యద్ నజీర్ నియాజీ, డాక్టర్ ఇక్బాల్ రచించిన 'తులూయె ఇస్లాం' మకుటంతో ఒక పత్రికను ప్రారంభించారు. ఈ జర్నల్ మొదటి ఎడిషన్‌ను నియాజీ డాక్టర్ ఇక్బాల్‌కు అంకితమిచ్చారు. డాక్టర్ ఇక్బాల్ ఉర్దూ, ఫార్సీ రచనలతో పాటు, ఆంగ్లంలో 'ది డెవలప్ మెంట్ ఆఫ్ మెటాఫిజిక్స్ ఇన్ పర్షియా', 'ది రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ రిలీజియస్ థాట్ ఇన్ ఇస్లాం ' అనే అంశాలపై రెండు గ్రంధాలు, అనేక పత్రాలు వెలువరించారు. వీటిలో పర్షియన్ భావజాలం, ఇస్లామిక్ సూఫీయిజం గురించి తన ఆలోచనలను వెల్లడించారు. తత్వశాస్త్రం, దేవుడు, ప్రార్థన, దాని అర్థం, మానవ ఆత్మ, ముస్లింల సంస్కృతి, అలాగే ఇతర రాజకీయ, సామాజిక, మతపరమైన సమస్యలను కూడా చర్చించారు. పాశ్చాత్య ప్రపంచం పట్ల డాక్టర్ ఇక్బాల్ అభిప్రా యాలను యునైటెడ్ స్టేట్స్ సుప్రీం కోర్ట్ అసోసియేట్ జస్టిస్ విలియం ఓ డగ్లస్ సహా అనేక మంది ప్రముఖులు మెచ్చు కున్నారు. ఇక్బాల్ నమ్మకాలు, ఆదర్శాలు సార్వకాలిక సర్వజనా మోదం కలిగి ఉన్నాయని కితాబునిచ్చారు. ఖచ్చితత్వానికి, నిజాయితీకి డాక్టర్ ఇక్బాల్ మారు పేరు. నిష్క్రియాత్మకతను ఖండించడం, అసమానత, వివక్ష, పీడన, అణచివేతకు వ్యతిరేకంగా ఆయన తెలిపే ధర్మాగ్రహ నిరసన, ఆశావాద జీవితం పట్ల స్పష్టమైన వైఖరి, ప్రపంచంలో మానవుడి లక్ష్యం, ఒక్క మాటలో చెప్పాలంటే, మానవతావాదం, ప్రజాస్వామ్యం, శాంతి, సామరస్యం, ప్రజల మధ్య స్నేహం సౌహార్ద్రతలు తదితర అనేక సుగుణాలకు ఆయన నిలువెత్తు చిరునామా. ఇంతటి గొప్ప మనిషి, మహాకవి, పండితుడు, డాక్టర్ అల్లామా ముహమ్మద్ ఇక్బాల్ 1938, ఏప్రిల్ 21న తీవ్రమైన గొంతు ఇన్ఫెక్షన్ కారణంగా తుది శ్వాస విడిచారు. మంచికీ, మానవతకు, మైత్రీ బంధానికి, ప్రజాస్వామ్య విలువలకు ప్రతీకగా నిలిచారు అల్లామా ఇక్బాల్.

✤




- సల్మాన్ హైదర్

'ముస్లిమ్స్ ఇన్ ఇండియా- గ్రౌండ్ రియాలిటీస్ వర్సెస్ ఫేక్ నేరేటివ్స్- అచీవ్‌మెంట్స్ & అకాంప్లిష్‌మెంట్స్'లో పొందుపరచిన వివరాల ప్రకారం తెలంగాణలోని ప్రభుత్వ విభాగాలు, సంస్థలలో ముస్లిం ఉద్యోగుల ప్రాతినిధ్యం అత్యల్పంగా ఉన్నది.

2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణా జనాభాలో ముస్లిములు 12.68 శాతం ఉన్నప్పటికీ సామాజిక, ఆర్థిక రంగాలలో తగిన ప్రాతినిధ్యం లేదు.

❖ గత రెండు క్యాబినెట్లలో ముస్లింలు ఉండగా ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా ముస్లిం మంత్రి ఎవరూ లేరు.

❖ 2014 నుండి 2018 వరకు తెలంగాణ రాష్ట్ర మొదటి ఉప ముఖ్యమంత్రి ముస్లిం.

❖ 2023 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో హెూం, జైళ్లు, అగ్నిమాపక సేవలు, రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, రిలీఫ్, పునరావాసం, అర్బన్ ల్యాండ్ సీలింగ్ వంటి శాఖలను ముస్లిములు నిర్వహించారు.

❖ తెలంగాణ రాష్ట్రంలోని ముస్లిం జనాభాలో 75 నుంచి 80 శాతం మంది వెనుకబడిన తరగతుల (బీసీ) వర్గాలు.

❖ తెలంగాణలోని మొత్తం 4.465 మిలియన్ల ముస్లింలలో, ఒక్క హైదరాబాద్ జిల్లాలో 1.713 మిలియన్ల ముస్లిములు ఉన్నారు.

❖ హైదరాబాద్ జిల్లాలోని ముస్లిములు మొత్తం తెలంగాణా రాష్ట్రంలోని ముస్లిం జనాభాలో 43.5 శాతం.

❖ ముస్లిం జనాభాలో 33 శాతం మంది 14 ఏళ్లలోపు వారు.

❖ హైదరాబాద్ జిల్లాలో 43.5 శాతం మంది ముస్లిములు ఉన్నారు.

❖ రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, మెదక్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలలో ముస్లింలు ఎన్నికల ఫలితాలలో గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నారు.

❖ కనీసం 40 శాతం అసెంబ్లీ నియోజకవర్గాలలో ఫలితాలను ముస్లిములు ప్రభావితం చేయగలరు.

❖ తెలంగాణ ప్రభుత్వం 2016లో ఏర్పాటు చేసిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జి.సుధీర్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల

విచారణ కమిషన్ ముస్లిం సామాజిక, ఆర్థిక పరిస్థితులపై అధ్యయనం చేసింది.

❖ సుధీర్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల విచారణ కమిషన్ బ్యూరోక్రసీలో ముస్లింల తక్కువ ప్రాతినిధ్యం, ఆర్థిక, సామాజిక వేదికలలో వారి పరిమిత భాగస్వామ్యాన్ని హైలైట్ చేసింది.

❖ తెలంగాణ ప్రభుత్వంలోని 23 శాఖల్లో ముస్లిం ఉద్యోగుల ప్రాతినిధ్యం దాదాపు 7.36 శాతంగా ఉందని, ఇది దాదాపు 13 శాతంగా ఉన్న సమాజ జనాభాకు పూర్తి భిన్నంగా ఉందని కమిషన్ గమనించింది.

❖ ప్రస్తుతం, ముస్లిం సమాజంలోని 16 శాతం మంది ఎప్పుడు ఏ విద్యా సంస్థకు హాజరు కాలేదు.

❖ ముస్లిం సమాజంలో డ్రాప్ అవుట్ రేట్లు ఎక్కువగా ఉన్నాయి.

❖ డేటా ప్రకారం, 18-20, 21-29 మధ్య వయస్సు గల పురుషులలో డ్రాపౌట్ల శాతం వరుసగా 31.6 శాతం, 81.5 శాతంగా ఉంది.

❖ 18-20, 21-29 మధ్య వయస్సు గల స్త్రీలలో డ్రాపౌట్ల శాతం వరుసగా 71.5 శాతం, 52.8 శాతంగా ఉంది.

❖ 2023లో స్టేట్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌లో, 69 మంది అధికారులలో ఒకరు ముస్లిం, 105 స్టేట్ పోలీస్ సర్వీస్ అధికారులలో ముగ్గురు ముస్లింలు ఉన్నారు.

❖ పోలీసు శాఖలో, పోలీసు సూపరింటెండెంట్లు (ఎస్పీలు), అదనపు ఎస్పీల సంఖ్య 42 మంది ఉన్నారు, అందులో ఒకరు ముస్లిం.

❖ సబ్-డివిజనల్ పోలీసు అధికారులు (SDPOలు), డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (DSPలు) సంఖ్య 65, వీరిలో ఇద్దరు ముస్లింలు.

❖ లా అండ్ ఆర్డర్, క్రైమ్ విభాగాల్లో 667 మంది ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు ఉండగా అందులో 36 మంది మాత్రమే ముస్లిం వర్గానికి చెందిన వారు.

❖ తెలంగాణలోని స్టేట్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌లో, 525 మంది అధికారులలో 23 మంది ముస్లింలు కాగా, 155 స్టేట్ పోలీస్ సర్వీస్‌లలో ఆరుగురు ముస్లింలు.

❖ లేబర్ డిపార్ట్‌మెంట్‌లోని ముస్లిం అధికారులు (ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్‌లు, డిప్యూటీ, అసిస్టెంట్ డైరెక్టర్‌లతో సహా) మొత్తం 154 మందిలో 15 మంది ముస్లిములు ఉన్నారు.

❖ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీలో, ఉన్నతాధికారులు 29 మందిలో ఒక్క ముస్లిం కూడా లేరు.

❖ వాణిజ్య పన్నుల శాఖ నిర్వహణ బృందం Management Team లో 248 ఉన్నారు. వారిలో ఇద్దరు ముస్లింలు.

❖ 85 మంది డ్రగ్ కంట్రోల్, ఇన్‌స్పెక్షన్ అధికారులలో, రాష్ట్రవ్యాప్తంగా ఐదుగురు ముస్లింలు.

❖ తెలంగాణలో గత దశాబ్ద కాలంలో ఏ ముస్లిం కూడా ప్రాసిక్యూషన్ హెడ్, అడ్వకేట్ జనరల్ (ఏజీ) కాలేదు.

❖ తెలంగాణలోని ఐదుగురు ప్రధాన న్యాయమూర్తులలో ఒక్కరు కూడా ముస్లిం లేరు. అలాగే 35 మంది న్యాయ మూర్తులలో అసలు ముస్లిం కమ్యూనిటీకి ప్రాతినిధ్యం లేదు.

❖ 468 మంది అదనపు ఏజీలు, ప్రభుత్వ ప్లీడర్లలో పద్నాలుగు మంది ముస్లింలు ఉన్నారు.

❖ 193 జిల్లా ప్రాసిక్యూటింగ్ అధికారులలో 10 మంది ముస్లింలు ఉన్నారు.

❖ ఎక్సైజ్/ప్రొహిబిషన్ డిపార్ట్‌మెంట్ నిర్వహణ, తనిఖీ బృందాలలో మొత్తం 15 మందిలో ఒక్కరు మాత్రమే ముస్లిం.

❖ హైదరాబాద్ ఎల్&టీ మెట్రో రైల్‌లోని 69 మంది సీనియర్ మేనేజ్‌మెంట్ టీమ్ సభ్యులలో ఇద్దరు ముస్లింలు.

❖ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (PWD)లో 671 మందిలో ముస్లిం అధికారులు ఒక సూపరింటెండింగ్ ఇంజనీర్‌తో సహా 39 మంది ఉన్నారు.

❖ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్‌టీసీ)లో మొత్తం 240 మంది అధికారులుండగా కేవలం ఎనిమిది మంది మాత్రమే ముస్లిములు ఉన్నారు.

❖ అటవీ శాఖ సీనియర్ మేనేజ్‌మెంట్ బృందంలో 290 మంది అధికారుల్లో ముస్లింలు లేరు.

❖ తెలంగాణలోని 164 మంది ఐఏఎస్‌లలో తొమ్మిది మంది ముస్లింలు. తెలంగాణలోని 123 మందిలో ముగ్గురు ముస్లింలు ఐపీఎస్‌లుగా ఉన్నారు.

❖ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఇద్దరు చైర్మన్‌లు ఉండగా వారిలో ముస్లింలు లేరు.

❖ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ 17 మంది

**మిగతా 27వ పేజీలో...**




# తినడానికీ ఓ పద్ధతి!

**ఆరోగ్యమే మహా భాగ్యం.** చక్కని ఆరోగ్యం కోసం మనం తినే ఆహారం పట్ల ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. పద్ధతి ప్రకారం ఆహారం వండాలి, తినాలి. ఇస్లాంలో ఇందుకు సంబంధించి ఎన్నో నియమాలు, మర్యాదలున్నాయి! వీటి గురించి హాఫిజ్ నజర్ అహ్మద్ తన పుస్తకం 'తిబ్బె నబవీ'లో వివరించారు. మహమ్మద్ ప్రవక్త(స) ఎన్నో ఆహార నియమాలను బోధించారు. అందులో ప్రధానమైనవని ఏమంటే... మనం తినే ఆహారం హలాల్ (ధర్మబద్ధంగా) సంపాదనదై ఉండాలి. అలాగే అది పరిశుభ్రంగా ఉండాలి. జిబహ్ చేయని, వ్యాధి వల్ల, గాయాల వల్ల చనిపోయినవి, అల్లాహ్ పేరుతో కాకుండా ఇతరులతో పేరు ఉచ్చరించి జిబహ్ చేయబడిన జంతువుల ఆహారం తినడం నిషిద్ధం. చచ్చిన జంతువు మాంసం విషతుల్యంగా మారే అవకాశం ఉండటమే ఇందుకు కారణం. అత్యంత అశుద్ధమైన జంతువైన పంది మాంసం, రక్తాన్ని, సారాయిని అధర్మ ఆహార పదార్థాల జాబితాలో ఉంచారు. బజారుల్లో నిలబడి పచార్లు చేస్తూ తినడం సభ్యతకు, నాగరికతకు విరుద్ధం.

### ఆహారం తినేటప్పుడు పాటించాల్సిన నియమాలు

ఆహారం తినే ముందు కాళ్లు, చేతులు కడగడం వల్ల ఆరోగ్యం ఉండటంతోపాటు, దారిద్ర్యం దరికి రాదు. తినే ముందు అల్లాహ్‌ను ప్రార్థించాలి. కుడి చేత్తో తినాలి, తాగాలి. కింద కూర్చొని రెండు తొడలను ఒకచోట చేర్చి కుడి కాలిని నిలబెట్టి, ఎడమ కాలిపై కూర్చొని తినడం మంచి పద్ధతి. తినడంలో తొందరపాటు కూడదని దైవ ప్రవక్త(స) తెలిపారు. ఆహారాన్ని వృథా చేయకూడదు. ఆహారాన్ని వృథా చేసేవారిని అల్లాహ్ ప్రేమించడని ఖుర్‌ఆన్ తెలియజేస్తున్నది. తన శరీర స్వభావానికి, ఆరోగ్యానికి సరిపడే ఆహార, పానీయాలనే తీసుకోవాలి. వాతావరణానికి సరిపడనివి తీసుకోకూడదు. ఆహారాన్ని మితిమీరి తీసుకొంటే

మధుమేహం, రక్తపోటు, పక్షవాతం, గుండె జబ్బు, అకాల వార్ధక్యం, స్థూలకాయం, అజీర్తి లాంటి జబ్బులు వస్తాయని దైవప్రవక్త(స) హెచ్చరించారు. ఆహార పాత్రల్లో నోటితో ఊడకూడదని... అలా చేయడం వల్ల మన పళ్లలో ఉండే వ్యాధికారక క్రిములు మరొకరికి సోకే ప్రమాదం ఉందని తెలిపారు. కింద పడిన ఆహారాన్ని వృథా చేయకుండా శుభ్రం చేసి తినాలని ఆయన సూచించారు. దాని వల్ల దారిద్ర్యం దూరం కావడంతో పాటు మరి కొన్ని శుభాలు కలుగుతాయని తెలిపారు. రాత్రి వేళ తప్పక భోజనం చేయాలని... కనీసం పిడికెడు ఖర్జూరాలైనా తినాలని చెప్పారు.



## అన్నదానం ఎంతో పుణ్య ఫలం

దైవప్రవక్త(స) ఎలాంటి తారతమ్యాలు లేకుండా అందరితో కలిసి తినేవారు. ఒంటరిగా ఎప్పుడూ తినే వారు కాదు. ఈ విధానాన్ని మనమంతా పాటిస్తే మంచిది. సామూహిక భోజనాలు చేస్తున్నప్పుడు అందరూ తినడం పూర్తి కానంత వరకు లేవకూడదు. బోర్లా పడుకొని తినకూడదు. తినేటప్పుడు చేతి వేళ్లు నాకడం వల్ల ఆహారం అరుగుతుంది. ఆహారాన్ని కుడి వైపు నుంచి పంచాలి. ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయడం ఎంతో పుణ్య ఫలాన్ని ఇస్తుంది. భోజనం చేసిన తర్వాత ముఖం, కాళ్లు, చేతులు కడగడం శుభ సూచకం. అన్నం తిన్న తర్వాత కృతజ్ఞతా పూర్వకంగా దుఆ చేయాలి.

## నీళ్లు తాగాల్సిన విధానం

నీళ్లు కూర్చొని తాగాలి. కుడి చేతితో నీటి పాత్రను పట్టుకోవాలి. కొద్ది కొద్దిగా కనీసం మూడు గుక్కల్లో నీళ్లు తాగాలి. నీళ్లు తాగే ముందు 'బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్' అని పఠించాలి. తాగిన తర్వాత 'అల్‌హమ్‌దులిల్లాహ్' అని పలకాలి. నీళ్లు తాగడానికి వెండి, బంగారు పాత్రలు ఉపయోగించకూడదు. నీటి పాత్రలపై మూతలు ఉంచాలి. నీళ్ల పాత్రలో శ్వాస విడవకూడదు, ఊదకూడదు.

## ఆరోగ్యానికి మేలు చేసే ఆహార పదార్థాలు

దైవప్రవక్త(స) ఆరోగ్యానికి మేలు చేసే, రోగాల్ని తగ్గించే అనేక ఆహార పదార్థాల గురించి తెలియజేశారు. ఆవు పాలను, నెయ్యిని తప్పనిసరిగా తీసుకోవాలని, వాటిలో ఔషధ గుణాలున్నాయని చెప్పారు. దోసకాయ దాహం, వేడి, మంట, రక్తపోటును దూరం చేస్తుందని తెలిపారు. తర్బూజా పైత్యానికి, సెగ రోగానికి, కామెర్లకు హితకారిగా పని చేస్తుంది. సిరకా ఉదర వ్యాధులకు మంచి ఔషధం.

## నిద్రించే విధానం, వేళలు

వెల్లికిలా పడుకోవడం మంచిది. బోర్లా పడుకోకూడదు. దాని వల్ల జీర్ణకోశం, కంటి చూపు, సాధారణ ఆరోగ్యంపై దుష్ప్రభావం పడుతుంది. కుడి పక్కకు తిరిగి పడుకొంటే గుండె ఎడమ వైపు ఉంటుంది కాబట్టి ఎలాంటి భారం గుండెపై పడదు. పగలంతా పనులు చేసి రాత్రివేళ నిద్రపోవాలి. నిద్రించే ముందు, లేచిన తర్వాత అల్లాహ్‌ను ప్రార్థిస్తూ, కీర్తిస్తూ దుఆ చేయాలి.

## రోగులను పరామర్శించాల్సిన విధానం

రోగిని పరామర్శించడం బాధ్యతగా భావించాలి. అది పుణ్య ఫలాన్ని ఇస్తుందని తెలుసుకోవాలి. రోగి నుదుటిపై చేయి పెట్టి మీ ఆరోగ్యం ఎలా ఉంది అని అడగాలి. అతడిలోని ఆందోళనను దూరం చేసి మనస్సును కుదుటపరిచేలా మాట్లాడాలి. రోగి వద్ద ఎక్కువ సేపు ఉండకుండా క్లుప్తంగా పరామర్శించాలి. రోగి స్వస్థత కోసం ప్రార్థన(దుఆ) చేయాలి. మీ కోసం దుఆ చేయమని రోగిని కోరాలి. అతడి ప్రార్థన దైవదూతల ప్రార్థనకు సమానంగా ఉంటుంది. ❖

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది    ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

59 ఆయత్‌లు

# 44. అద్ దుఖాన్

మక్కా అవతరణ

10 – 16 సరే, వేచిచూడండి ఆ రోజుకై, అప్పుడు ఆకాశం స్పష్టంగా పొగ మోసుకు వస్తుంది, అది జనులను కప్పుకుంటుంది, ఇదీ బాధాకరమయిన శిక్ష. (ఇప్పుడు అంటున్నారు), "ప్రభూ, మా పై నుండి ఈ యాతనను తొలగించు, మేము విశ్వసిస్తాము." వీరి అలక్ష్యం ఎక్కడ దూరమవుతుందీ? వీరి స్థితి ఏమిటంటే వీరి వద్దకు ప్రస్ఫుటమయిన దైవసందేశహరుడు వచ్చేశాడు.[11] అయినప్పటికీ వీరు ఆయన వైపున శ్రద్ధ చూపలేదు, పైగా అన్నారు, "ఇతనయితే నేర్పించి పెట్టిన పిచ్చోడు."[12]

మేము ఇదో కాస్త యాతనను తొలగిస్తాము, అంతే, మీరు ముందు చేస్తూ ఉన్నదాన్నే తిరిగి చేస్తారు. ఏ రోజునయితే మేము పెద్ద దెబ్బ తీస్తామో ఆ రోజు, మేము మీ పట్ల ప్రతీకారం తీర్చుకునే రోజు.[13]

11. మూలంలో 'ప్రస్ఫుటమయిన దైవ సందేశహరుడు' అనే పదాలు ప్రయోగించబడ్డాయి. దానికి రెండు అర్థాలు. ఒకటి, అతను దైవసందేశహరుడు అవడం అతని శీల స్వభావాలు, అతని నైతికత, స్వభావ స్వరూపాలు, అతని కార్యకలాపాల వల్ల పూర్తిగా వ్యక్తమవుతున్నాయి. రెండవది, అతను యదార్థాన్ని స్పష్టంగా విడమర్చి తెలుపడంలో ఎటువంటి లోపం రానివ్వ లేదు.

12. వారు చెప్పిన దాని భావమేమిటంటే, పాపం ఈ మనిషయితే చాలా అమాయకుడే. కొందరు ఇతన్ని అనవసరంగా జెండాపైకి ఎక్కించారు. వాళ్ళు చాటుమాటుగా ఖుర్‌ఆన్ ఆయత్‌లు రచి యించి ఇతనికి చదివించి నేర్పిస్తారు, ఇతను వచ్చి వాటిని జనసామాన్యానికి అందజేస్తాడు. వాళ్ళేమో హాయిగా కూర్చుని ఉంటారు, ఇతనేమో మాటలూ పడతాడు, రాళ్ళ దెబ్బలూ తింటాడు. ఈ విధంగా ఆ జనులు ఒక తేలికయిన విసురు విసిరి, సమస్త ఆధారాలను, ఉపదేశాలను, గంభీర బోధనలను మాటల్లో కొట్టిపారేసే ప్రయత్నం చేస్తారు. ప్రవక్తశ్రీ (స) సంవత్స రాల తరబడి వారి సమక్షంలో అందజేసి అలసిపోతున్న విష యాలనన్నింటినీ ఆషామాషీగా వదిలించుకోజూస్తున్నారు. దివ్య ఖుర్‌ఆన్‌లో చెప్పబడే సమంజసమయిన మాటల పట్ల శ్రద్ధనూ చూపడం లేదు, ఈ మాటల్ని అందజేసే వ్యక్తి ఏ స్థాయి మనిషో కూడా గమనించే స్థితిలో లేరు. ఈ నిందమోపుతున్నప్పుడు తాము వాగేదేమిటో కాస్తయినా ఆలోచించే శ్రమ తీసుకోవ డానికీ సిద్ధంగా లేరు, ఒకవేళ మరోవ్యక్తి ఎవరయినా చాటు మాటుగా ఉంటూ నేర్పించి పెట్టేవాడు ఉన్నట్లయితే అతను, తొలి ముస్లిములయిన ఆప్తులు హజ్రత్ ఖదీజా(ర), అబూబక్ర్(ర), అలీ(ర), జైద్ బిన్ హారిసా (ర) ప్రభృతుల దృష్టి నుండి ఎలా తప్పించుకోగలుగుతాడు? ఈ విషయం ప్రస్ఫుటంగా కాన వస్తూనే ఉంది. ఈ వ్యక్తులకన్నా ప్రవక్త మహనీయులకు (స) అన్నివేళలా సన్నిహితంగా ఉండే సహచరుడు మరొకడెవడూ లేడు. అలాంటప్పుడు ఈ వ్యక్తులే అందరికన్నా అధికంగా ప్రవక్తశ్రీ (స) పట్ల అనురాగం, అభిమానాలు, శ్రద్ధాసక్తులు కలిగి ఉండేవారు. వాస్తవంగా ఎవరో చాటుమాటుగా నేర్పించి బోధించి దైవదౌత్య కార్యకలాపాలు నెరపుతూ ఉన్నట్లయితే ఈ జనులే ఆయన్ని ఎదిరించడానికి అందరికన్నా మున్ముందు ఉండేవారు. (మరిన్ని వివరాలకు చూడండి, ఖుర్‌ఆన్ అవగాహనం, సం.4, అన్ నహ్ల్ : పాదసూచి 107 సం.5, అల్ ఫుర్ఖాన్ : ఆయత్ 4, పాద సూచి 12).

13. ఈ ఆయత్‌ల భావంలో వ్యాఖ్యాతల మధ్య చాలా పెద్ద విభేదమే ఏర్పడింది. ఈ భేదాభిప్రాయం ప్రవక్త సహచరుల కాలంలోనూ ఉండేది. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్ ప్రముఖ శిష్యుడు మస్రూక్ ఇలా చెబుతున్నారు, "ఒకరోజు మేము కూఫా మస్జిద్‌లో ప్రవేశించినప్పుడు చూశాము. ఒక బోధకుడు జనుల సమక్షంలో ఉపన్యసిస్తున్నాడు. ఇతను "ఆ రోజున ఆకాశం స్పష్టంగా పొగ మోసుకువస్తుంది" అనే ఆయత్ చదివాడు. తరువాత ఇలా అన్నాడు, మీకు తెలుసా? ఈ పొగ ఎటువంటిదో? ఈ పొగ ప్రళయదినాన వస్తుంది, తిరస్కారుల్నీ, కపటుల్నీ గుడ్డివారుగా, చెవిటివారుగా చేసివేస్తుంది. కాని విశ్వాసులయిన వారి మీద దీని ప్రభావం కేవలం జలుబు చేసినంత మేరకే పడుతుంది. అతని ఈ మాట విని మేము హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ వద్దకు వెళ్ళాము. ఆయనకు ఆ బోధకుడు చేసిన వ్యాఖ్యానాన్ని వివరిం చాము. హజ్రత్ అబ్దుల్లా పరుండి ఉన్నారు.

13వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

## హుదైబియా విశేషాలు

**75)** నాఫె కథనం: మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కుమారులలో ఒక అబ్బాయి ఆయనుద్దేశించి, '(నాన్నా!) ఈ ఏడాది మీరు ఉమ్రా కొరకు వెళ్ళకుండా ఉంటే బాగుండేదేమో! ఎందుకంటే మీరు కాబా గృహం వరకూ వెళ్ళలేరేమో! అని నా అనుమానం' అని సలహా ఇచ్చారు. దానిపై ఇబ్నె ఉమర్(రజి) ఇలా అన్నారు: "లోగడ మేము దైవప్రవక్త(సఅసమ్)తో కలసి ఉమ్రా కొరకు ప్రయాణమయ్యాము. కాని ఖురైష్ అవిశ్వాసులు కాబా గృహం వరకూ చేరుకోకుండా మమ్మల్ని అడ్డుకున్నారు. అందువల్ల దైవప్రవక్త ఖుర్బానీ పశువులను హుదైబియాలోనే జిబహ్ చేసి, శిరోముండనం చేయించుకున్నారు. ప్రవక్త ప్రియ సహచరులు కూడా తలలు గొరిగించుకున్నారు. ఆ సందర్భంగా దైవప్రవక్త(స), "నేను నా మీద ఒక ఉమ్రాను తప్పనిసరి (వాజిబ్) చేసుకున్నానన్న విషయానికి మీరే సాక్షులు!" అని పలికారు. (ఆ విధంగా సహచరమాన్యులపై కూడా ఆ ఉమ్రా తప్పనిసరి అయింది). కనుక ఈ రోజు నన్ను బైతుల్లాహ్ వరకూ చేరుకోనిస్తే నేను కూడా ప్రదక్షిణ (తవాఫ్) చేసుకుంటాను. ఒకవేళ నన్ను అడ్డుకుంటే, ఆనాడు దైవప్రవక్త(స) చేసినదే నేనూ చేస్తాను. మరి కొద్ది దూరం ముందుకుపోయిన తరువాత, 'నేను నా మీద ఉమ్రాతోపాటు హజ్జ్‌ను కూడా తప్పనిసరిగా ఖరారు చేసుకున్నాను. ఈ విషయానికి మీరే సాక్షులు' అని చెప్పారు. 'నా దృష్టిలో హజ్జ్, ఉమ్రాలు రెండూ ఒకలాంటివే' అని కూడా పలికారు. తరువాత ఆయన (మక్కా చేరుకోగానే) ఒకసారి ప్రదక్షిణ (తవాఫ్), సయీ చేశారు. చివరకు ఆ రెండింటినీ నెరవేర్చారు.

**78)** అబూ వాయిల్ కథనం: సహ్లా బిన్ హునైఫ్(రజి) సిఫ్ఫీన్ యుద్ధం (ఈ యుద్ధం మహనీయ అలీ-రజి-కి- ముఆవియా-రజి-కి మధ్య జరిగింది) నుండి తిరిగి వచ్చినప్పుడు, పరిస్థితుల స్వరూపాన్ని గురించి తెలుసుకోవడానికి మేము ఆయన దగ్గరకు వెళ్ళాము. ఆయన ఇలా అన్నారు : మీరు ఈ యుద్ధంపై మీ మీ అభిప్రాయాలను వ్యక్తం చేసి బడాయి పోకండి.[1] నేను 'అబూ జందల్ రోజున' కూడా (హుదైబియాలో) ఉన్నాను.[2] ఒకవేళ దైవప్రవక్త(స) ఆజ్ఞను ఉల్లంఘించటం సంభవమై ఉంటే, నేను ఆ రోజే ఆజ్ఞోల్లంఘనకు ఒడిగట్టి ఉండేవాణ్ణి. సంక్లిష్టమైన కార్యసాధన కోసం మేము మా ఖడ్గాలను భుజాలకు వ్రేలాడదీసుకున్నప్పుడల్లా పరిస్థితుల స్వరూపం మా కొరకు సులభతరం అయిపోయింది. మేము ఆ సంక్లిష్ట సంక్షోభాన్ని అధిగమించామన్న విషయం దైవానికి, దైవప్రవక్త(స)కు బాగా తెలుసు. కాని ఈ యుద్ధ పరిస్థితి కడు విచిత్రం. ఈ యుద్ధంలో మేము (ఉపద్రవం యొక్క) ఒక రంధ్రాన్ని మూసివేస్తే, రెండవ రంధ్రం తెరచుకునేది. ఆ సమయంలో ఏం చేయాలో మాకు బోధపడేది కాదు.

78-1. 'సిఫ్ఫీన్' అనేది ఒక ప్రదేశం పేరు. ఈ ప్రదేశంలోనే హజ్రత్ అలీ (రజి)కి- ముఆవియా (రజి)కి మధ్య పోరాటం జరిగింది. రెండు ముస్లిం వర్గాల మధ్య జరిగిన సమరమది.

78-2. హదీసు మూలంలో 'యౌమె అబూజందల్' ప్రస్తావన వచ్చింది. అబూ జందల్ సంఘటన ముస్లింల పాలిట ఒక పరీక్ష. ఒకవైపు హుదైబియా ఒప్పందం దస్తావేజు పూర్తిగా వ్రాయకముందే, అబూ జందల్ ఇస్లామ్ స్వీకరించి మక్కా నుండి హుదైబియాకు పారిపోయి వచ్చారు. తనను ముస్లింలు ఆదుకుంటారని అబూ జందల్ ఆశించారు. అతనిని అవిశ్వాసులకు తిరిగి అప్పగించటం తమకు అవమానకరం అని ముస్లింలు తలపోశారు. కాని దైవప్రవక్త(స) హుదైబియా ఒడం బడికకు కట్టుబడి, ఆ బాధిత వ్యక్తిని మక్కా ఖురైషులకు అప్పగించారు.

కాబట్టి మీరు మీ మీ స్వంత అభిప్రాయాలపై గర్వపడకండి. షరీఅత్ కోణం నుండి విషయాన్ని తరచి చూడండి అన్నది సహ్లా బిన్ హునైఫ్(రజి) పలుకుల్లోని అంతరార్థం.

★ ★ ★

# మతం- రూపం- ఆవశ్యకత

- ఎస్.ఎమ్.మలిక్

**మానవ** చరిత్రను ప్రపంచంలో ఏ దశననయినా, మరి ఏ ప్రదేశంలోనయినా పరిశీలిస్తే కొన్ని యథార్థాలు అతి సునాయాసంగా ముందుకు వస్తాయి. వాటిలో ఒకటి అతి ముఖ్యంగా కానవచ్చేది, మనిషి సదా తనను గురించి, ఈ ప్రపంచం గురించి, దీని పుట్టుక, మనుగడ ఎలా సాగుతోందనన్న విషయాన్ని గురించి చింతిస్తూ, వాటిని తన ఊహల ప్రకారం లేదా తనకు నమ్మకమున్నవారు తెలిపిన దాని ప్రకారం కొన్ని నమ్మకాలు కలిగి జీవించాడు. అటువంటి నమ్మకాలలో ఒకటి దైవ భావన.

## దైవం

ఈ సువిశాల విశ్వ వ్యవస్థ, సూర్యచంద్రులు మొదలుకుని, ఈ భూమి, భూమి మీద ప్రాణులు, చెట్లు, నదీనదాలు, కొండలు, కారడవులు- సర్వం ఏదో ఓ కానరాని శక్తి, సకల స్థోమతలతో అలరారే శక్తి, సర్వోపరిజ్ఞాని అయిన శక్తి ద్వారా ఉనికిలోకి వచ్చాయన్నది అనాదిగా మానవుల్లో ప్రచారం పొందిన విషయం. ఆ శక్తినే దైవం అని పేరు పెట్టుకున్నాడు మనిషి. ప్రపంచమంతటా విస్తరించిన మానవ జాతి, తాను నివసించిన ఆయా ప్రాంతాల్లో తాను అభిప్రాయ వ్యక్తీకరణకు ఏర్పరచుకున్న భాషలో ఏమనిపించినా ఆ శక్తిని గురించి ఊహలు, భావనలు మటుకు విశ్వజనీనంగా దాదాపు ఒకే మాదిరిగా ఉండేవి.

అటువంటి దైవభావన, ఆ దైవం పట్ల మానవ వ్యవహారం ఎలా ఉండాలి అన్నదాన్ని నిర్వచించేదే మతం. మతం మానవ వ్యక్తిగత జీవితంలోనూ, సామూహిక జీవితంలోనూ మనిషికి ఎన్నో విధాలుగా దారి చూపింది. దాని వివరాలు తరచి చూడదలిస్తే అదంతా ఓ మహా గ్రంథమే అవుతుంది. కాని మానవ చరిత్రను దృష్టిలో ఉంచుకుని స్థూలంగా చూసినా మతం ఆవశ్యకత ఎంతయినా ఉందని, అది అనేక చిక్కు ప్రశ్నలకు సమాధానం ఇస్తుందని ఇట్టే ద్యోతకమయిపోతుంది. కాకపోతే ఒకరికి వాటివల్ల తృప్తి కలగవచ్చు మరొకరు ఎవరికయినా ఏమాత్రం మనసుకెక్కక పోవచ్చు. ఏది ఏమయినా మతం పాత్రను మానవ జీవితంలో నిరాకరించడానికి వీల్లేదు. అది జీవితానికి ఎన్నెన్నో వరప్రసాదాలను అనుగ్రహించిన మాట ఎవరూ కాదనలేనిది.

## విచ్ఛిన్నత

జనం, మతం పేరిట, దైవం పేరిట, దైవాన్ని మానవ కర్త, సృష్టి యావత్తుకు జీవనదాత అని అంగీకరిస్తూనే జనుల్లో సమైక్యతకు బదులు విచ్ఛిన్నాన్ని రగుల్గొలుపుతుంటారు. అందువల్ల మతం అన్నా, మతం అందజేసే సందేశమన్నా విరక్తి కలుగుతోంది సాదాసీదా మనస్కులకు. మతాన్ని అడ్డంగా పెట్టుకుని జనులు, వర్ణం, వర్గం, కులం ప్రాతిపదికగా వైషమ్యాలు సృష్టిస్తూ. నిజానికి మతం అన్నది ఆధి భౌతిక విషయం, కానరాని దైవానికి సంబంధించిన విషయం. దైవం మానవాళికి, నిఖిల జగతికి సృష్టికర్త. దైవం తన సృష్టిరాశుల్లో శాంతిని, శ్రేయాన్ని సామరస్యాన్నీ కాంక్షిస్తాడు. ప్రేమ పరిఢవిల్లాలని, సమైక్యత సర్వసాధారణమవ్వాలని కోరుకుంటాడు. వైరాన్ని వైషమ్యాన్ని ఏమాత్రం ఇష్టపడడు.

## ప్రేమను పంచిపెట్టు

మతం, పదార్థ ప్రేమను, విషయ లోలత్వాన్ని నిరసిస్తుంది. మత వేదిక నిర్వహించే పాత్ర కనీసం, మానవుణ్ణి అతని సృష్టికర్త, ఆరాధుడు, దైవంతో మమేకపరిచే వ్యవస్థ. అది సృష్టి యావత్తుని, ముఖ్యంగా బుద్ధీ వివేకాలతో అలరారే మానవుణ్ణి, లోకమంతా విస్తరించి ఉన్న మానవ జాతిని వారి ప్రభువుతో సమైక్యపరచటం చేత స్వయంగా మానవుల మధ్య కూడా అనుబంధాలు పెరగాలి, దూరాలు చెరిపి వేయబడాలి, అనుబంధాలు పటిష్టమవుతూ, పెరుగుతూ ఉండాలి. మానవులంతా అలా ఒకే అస్తిత్వం, దైవంతో సమైక్యమయిన స్థితిలో వారి మధ్య దూరాలకు, ద్వేషానికీ తావేది?

## ఆశలు పెంచాలి!

మతం మనిషిలో ఆశలు రేకెత్తించాలి. మనిషికి మనిషి పట్ల ఆశ, మనిషికి రేపటి పట్ల ఆశ; ఆశలు పెరగటం వల్ల మనిషిలో

క్రియాశీలత పెరుగుతుంది. నిర్మాణ వైఖరి ప్రవర్ధమానమవుతుంది. మతం మనిషిని నిరాశ పరచరాదు. నిరాశ మనిషిలోని శక్తి సర్వాన్నీ క్రుంగదీస్తుంది, మనిషిలోని క్రియాశీలతను నిర్వీర్యం చేస్తుంది. మనిషి విచ్ఛిన్నత వైపునకు మొగ్గుదల చూపెట్టడం మొదలెడతాడు. ఈ వైఖరి ప్రపంచ వినాశానికి దారి తీస్తుంది. ఆశలు లేని, లేదా ఆశలు చచ్చిన జీవితం వినాశ హేతువే తప్ప మరేమీ కాదు.

నేడు ఎల్లెడలా విచ్ఛిన్నత, విచ్ఛిన్నతా భావాలు బాగా వ్యాప్తి చెందుతున్నాయంటే కారణం మనిషి తనను గురించి, తన భవిష్యత్తును గురించి, తోటి మానవులను గురించి, మొత్తానికి మనుగడను గురించి అతి తీవ్రమయిన నిరాశకు లోనయి పోవడమే. సుఖం లేని ఈ జీవితం ఎందుకు, ఎవరి కోసం, 'రేపు' అన్నది లేనప్పుడు నేటితో, ఈ అధ్యాయంతో కథను ముగిస్తే సరిపోదా? అన్న ప్రశ్నల్ని ఎదుర్కొని మనిషి తన జీవిత పరమార్థాన్ని మరచిపోతున్నాడు. అందువల్లనే మతం భూమిక బ్రతుకులో దృఢమయినదీ, ప్రామాణికమయినదీ, అత్యంతా వశ్యకమయినదీ కావడం ముఖ్యం!

పునాదులు బలహీనమయినవయితే దాని కట్టడం కూడా బలహీనం, నిరాధారమయి అది కూలిపోయే ప్రమాదముంటుంది. అందువల్ల మతాన్ని ఆశ్రయించే ముందే, ప్రారంభంలోనే ఇవన్నీ సజావుగా ఉన్నాయో లేదో చూసుకోవలసి ఉంటుంది.

## అందజేసిన వాడు

మతం మనిషిని మలిచేదయి ఉంటుంది. అందువల్ల మతం ఎటునుంచి వచ్చింది, దాని మూలం ఏది, అందజేసినవారి గుణగణాలు, శక్తి, సామర్థ్యాలు ఏ పాటివి, ఆ మూలం ద్వారా అందిన ధార్మిక బోధనలు ఏమిటీ? అన్న అనేక విషయాల ఆధారంగానే దాని పటిష్టత, ప్రామాణికత ద్యోతకమవుతాయి. ఆ బోధనలు మానవులందరికీ సమానంగా వర్తించేవా లేదా, వాటి ప్రాముఖ్యత ఏ పాటిది అని పరికించవలసి ఉంటుంది. ఆ బోధనలు నిరాధారమయినవి, తాత్కాలికమయినవి, కాల్పనికమయినవయితే ఆశించిన ఫలితాలు అందజాలవు.

## మతమంటే

మతం, ధార్మిక విషయాలు, దైవం, దైవ విధేయత- ఇదంతా వినగానే జనులు ఏమని అనుకుంటారు? అంతా చిత్ర విచిత్ర మయిన గాథలుంటాయి, విస్మయపరిచే కార్యకలాపాలుంటాయి, వింతగొలిపే గాథల సమాహారముంటుంది అని తలపోస్తారు జనం. ఇదంతా మౌఢ్యం, మతం కాదు. మతం అన్నది మనిషిలో విజ్ఞానాన్ని, వివేచనను పెంపొందించేదిగా, సమర్థించేదిగా, బుద్ధికీ హేతువుకు సంతృప్తపరిచేదిగా ఉండాలి. వైజ్ఞానిక దృక్కోణాన్ని బలపరిచేదిగా ఉండాలి. అలాకాక వైజ్ఞానిక భావాలను సహించకపోయేది, నిరసించేది కారాదు. అది మూఢ విశ్వాసాలకు, గుడ్డి నమ్మకాలకు చోటిచ్చేది కారాదు.

మతం అన్నది విశ్వాసంలో జీవనదాయకుని ఎరుకను, తెలివిడిని, జ్ఞానాన్ని సమకూర్చేది, ఆయన పట్ల అవగాహనను కలిగించేది, సృష్టికర్తతో సామీప్యాన్ని కలిగించేదిగా కాగలగాలి. అప్పుడే ఆ ప్రభువు పట్ల ఆరాధనా భావం, కృతజ్ఞతా భావం, దాస్యభావం జనిస్తాయి. ఆ స్వామి స్వయంగా నిత్య సజీవుడు, జీవన ప్రదాయుడు. ఆ ఎరుక బలపడినప్పుడే ఆయన పట్ల ఆరాధనా భావం, అభివందనా భావం ఉత్పన్నమవుతాయి మనిషిలో.

నిర్జీవమయినది, స్వయంగా సృష్టితమయినది, తానుగా తనను గుర్తించజాలదు. మరో సృష్టిరాశినీ గుర్తించి గౌరవించజాలదు. అంతేకాదు అది స్వయంగా తన సృష్టికర్తనూ, విశ్వ సృష్టికర్తనూ గుర్తించజాలదు, ఆయన్ని ఆదరించి కృతజ్ఞతా భావంతో మోకరిల్లనూ జాలదు.

## సత్యజ్ఞానమే మతం

దిశ లేనిదీ, లక్ష్య రహితమయినదీ, గమ్య శూన్యమయినదీ అసలు మతమే కాజాలదు. మతం అన్నది సత్యం ఆధార భూత మయినది, అసలు సత్యమే మతం. సత్యానికి దిశ ఉంటుంది, గమ్యమూ ఉంటుంది, మార్గమూ ఉంటుంది. అలాంటప్పుడు సత్యాసత్యాలు సమానమెలా అవుతాయి? సత్యాసత్యాలు ఒకేచోట ఎలా చేరగలవు?

సత్యాన్ని ఆశ్రయించినది ఏదయినా అందులో సత్యప్రియత, నిష్పక్షపాత దృష్టి, సాహసం, సంకల్పం- అన్నీ సమంగా ఉంటాయి. సత్యప్రియత లేనిది మతమెలా అవుతుంది? అటువంటి జీవితం జీవితమెలా అవుతుంది? అందువల్లనే సత్యం, ధర్మం రెండూ పరస్పరాశ్రితమయినవి. మతం ఉన్నచోట సత్యం ఉండటం సహజం, అలాగే సత్యం ఉన్నచోటనే మతం, ధర్మం మనగలుగుతాయి. ఆ విధంగా సత్యమే నిజమయిన ధర్మం, అదే యదార్థం, అదే అసలు వాస్తవికత! వాస్తవికత అన్నది ఏ కోణంలోనూ భ్రమ లేదా Illusion కాజాలదు.

### "అల్ హక్క్"

దివ్య కుర్‌ఆన్‌లో దైవం పేరు 'హక్క్' అని కూడా వచ్చింది. హక్ అంటే సత్యం. 'అల్ హక్క్' అంటే ఏకైక సత్యం అని భావం. అంటే సత్యం అన్నది ఒక్కటే కాగలదు. ఒక్కటే సత్యమయినప్పుడు అదే సుస్థిరమయింది, అదే అస్తిత్వం కలది, అదే శాశ్వత మయినది. Permanent చిరస్థాయి అయినదీను!

### సర్వజనీనం

సత్యం సర్వ వ్యాపకం, సర్వ జనీనం (Universal). ఇది వాస్తవమే అయినట్లయితే సత్యం సదా ఒక్కటే కాగలదు. ఒక్కటికి మించి అనేక మయినది సర్వవ్యాపకం, సర్వ జనీనం కాజాలదు. ఎందుకంటే అది ఒక్కటే కాకపోతే, అనేకమయితే వాటి మధ్య ఘర్షణ తప్పదు. కాని విశ్వంలో సర్వత్రా నిరంతర ప్రశాంతత, సామరస్యత, లయబద్ధత మాత్రమే కానవస్తూ ఉంటుంది.

సత్యం పరిపూర్ణమయినది, శుభప్రదమయినది, అయితే సత్యం ఒక్కటే శుభదాయిని కూడా. సత్యమే జీవనం, జీవన దాయినినీ కూడా. అందువల్లనే సత్యం సుందరమయినది, రమణీయమ యినది- ఈ జీవితంలా, ఈ ధరిత్రిలా, ఈ విశ్వంలా! అందువల్లనే సత్యం సౌందర్యాన్ని ప్రేమిస్తుంది. సత్యం, సుందరమయిన సత్యం, సర్వవ్యాపకమయిన సత్యం వికృత రూపం ఎన్నడూ, ఏ క్షణానయినా ధరించజాలదు. ఇన్ని సుగుణాల సత్యం, దైవం, దైవిక శక్తి అర్థరహితమయిన, అగమ్యగోచరమయిన, బుద్ధి కందని, తికమక పెట్టే ఏ పనీ చేయజాలదు.

### న్యాయబద్ధత

సత్యం, న్యాయపూర్వకమయినది, కాదు, అదే మూర్తీభవించిన న్యాయం. అది న్యాయ పక్షపాతి, అదే న్యాయానికి నిర్వచనం కూడా. అందువల్లనే మానవాళికి సత్యమే స్వీకార యోగ్య మయినది. సత్యం సుందరమయినదయినట్లే సత్యం ఆనంద మయం కూడా. అది ఆనంద ప్రదాయిని, రుచికరమయినది, సత్యమే ఆస్వాదనీయమయినది. సత్యం మాత్రమే తనంతట తాను పరిపూర్ణమయినది, పరిపూర్వకమయినది. అందువల్ల సత్యంపైనే ఆశలు పెంచుకోవడం, ఆశలు పేర్చుకోవడం సాధ్యం! సత్యంపైని ఆశలు ఈడేరుతాయని ఆశించవచ్చు!!

మనిషిలో కోరికలు సహజం, అవి ప్రకృతి సిద్ధమయినవి. అవి సృష్టికర్త ప్రసాదించినవి. మనిషి ఎంతగా తన కర్తకు చేరువవు తాడో అంతే అతని కోరికలు, అభిలాషలు, ఆశలు కర్తకూ ప్రియ ప్రదమయినవిగా రూపొందుతూ ఉంటాయి. నిజానికి సహజ మయిన మానవీయ కోరికలు పవిత్రమయినవి, ఆదరణీయమ యినవి, ధర్మబద్ధమయినవే కాగలవు కాబట్టి!

నిజధర్మం, సత్యధర్మం, స్వతహాగా నష్టదాయకం కాజాలదు. ప్రకృతి రీత్యా అది పరిపోషకమయినది, అది మానవ సహజ అభిలాషలకు నష్టదాయకం ఎలా అవుతుంది. అది నిజమయిన, సహజమయిన కోరికల్ని ఈడేర్చే మార్గాలను సృష్టిస్తుంది, అభిలాషల్ని పెంచి పోషిస్తుంది.

**(మిగతా వచ్చేవారం)**


## చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015**

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**



# ఆకలితో ఉన్నారా?.... అన్నం తినండి!

ఇప్పుడు దేశంలో ఎక్కడ చూసినా విద్వేష గాలులు వీస్తున్నాయి. అలాంటి వాతావరణాన్ని కొన్ని మతోన్మాద శక్తులు క్రియేట్ చేస్తున్నాయి. మన ప్రస్తుత పాలకుల ప్రసంగాలే ఈ మతోన్మాద శక్తులను ఇలా ప్రేరేపిస్తున్నాయి. ఇటీవలె ముంబయి టాటా హాస్పిటల్ బయట అన్నదాన కార్యక్రమంలో హిజాబ్ ధరించి ఉన్న ఒక ముస్లిమ్ మహిళను జై శ్రీరాం అంటేనే అన్నం పెడతామని, లేదంటే ఆహారం పెట్టమని తెగేసి చెప్పారు. ఈ వైఖరిని ఖండిస్తూ, ముస్లిమ్ యువకులు మరుసటి రోజు అదే దవాఖాన ముందు అన్నదానం చేపట్టారు. అన్ని మతాల వారికీ ఎలాంటి భేద భావం లేకుండా ఆకలి తీర్చారు. హిందూ ముస్లిం, సిక్కులు ఇలా అన్ని మతాల వారికీ పుష్టిగా భోజనం పెట్టారు. 'మీరంతా ఆకలితో ఉన్నారు, మీలో ఎవరూ అల్లాహు అక్బర్' అని చెప్పనక్కరలేదు' అని ముస్లిమ్ యువకులు అందరికీ కొసరికొసరి వడ్డించారు. అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న అన్నారు మన పెద్దలు. అన్నదానం చేసేటప్పుడూ మతభేదాలు ఎందుకు? సర్వేజన సుఖినోభవంతు, మానవ సేవయే మాధవ సేవ అని బోధించే హిందూ ధర్మావలంబీకులు తమ ధర్మానికే చెడ్డ పేరు తెచ్చుకుంటున్నారు. మానవత్వంతో సేవలు అందిస్తే స్వచ్ఛందంగా సేవలందిస్తే ఆటోమేటిక్ గానే ఎదుటి వారి మతం పట్ల సదభిప్రాయం ఏర్పడుతుంది. 'నీ మతంలోని మానవతా విలువలను ప్రదర్శించు.. అప్పుడు నీ మతం పట్ల ప్రేమ పెరుగుతుంది. ఎదుటి మతాల వారిని ద్వేషిస్తే నువ్వు సాధించేదేదీ ఉండదు. నీ మతానికి చెడ్డ పేరు తప్పా.' అని చాలామంది సోషల్ మీడియాలో కామెంట్ చేస్తున్నారు.

# ముస్లిమేతరులతో ప్రవక్త మహనీయులు(స) ఎలా ఉండేవారు?

**సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

**(ప్రజలారా!) మీలో నుండే మీదగ్గరకు దైవప్రవక్త వచ్చాడు. మీరు నష్టపోవడం ఆయనకి ఎంతో బాధగా ఉంటుంది. మీ శ్రేయస్సునే ఆయన ఎక్కువగా కోరుకుంటున్నాడు. విశ్వాసుల పాలిట ఆయన గొప్ప వాత్సల్యమూర్తి, అమిత దయగలవాడు. (అత్-తౌబా: 128)**

మహనీయ ముహమ్మద్(స) సత్యోద్యమాన్ని ప్రారంభించినప్పుడు విశ్వవ్యాప్తంగా బహుకొద్ది మాత్రమే స్వచ్ఛమైన ముస్లింలు. మిగతావారంతా ముస్లమేతరులే. వారిలో ఆస్తికులూ ఉండేవారు, నాస్తికులూ ఉండేవారు. గ్రంథ ప్రజలూ ఉండేవారు. బహు దైవోపాసకులూ అంటే ఆయన ఎక్కువ సమయం ముస్లిమేతర సోదరులతో, ముస్లిమేతర బంధువులతో, ముస్లిమేతర ఇరుగు పొరుగుతో, ముస్లిమేతర సహవాసులతోనే గడిపారు. ఆయన ఉన్నత నైతిక విలువలకి ముస్లిమేతరులు ఆశ్చర్యచకితులయ్యే వారు. స్మితపూర్వభాషి సత్యప్రవక్త ముహమ్మద్ (స). ఆయన మాటకన్నా మందహాసమే ముందుగా ఎదురొస్తుంది అనేవారు ఆయన్ను చూసిన ప్రతి ఒక్కరూ. ఆయన ఆదర్శ ప్రవర్తనా ప్రభకు గులాములయి ఒక్కొక్కరుగా ఇస్లాం సత్య ధర్మ ఛత్రఛాయల్లోకి వచ్చి చేరనారంభించారు. అలా 23 సంవత్సరాల అనతి కాలంలోనే మానవ చరిత్రలో మునుపెన్నడూ కనీ విని ఎరుగని రీతిలో ఓ అద్భుత సమాజాన్ని బలమైన పునాదుల మీద స్థాపించారు. చివరి హజ్ సమయానికి ఆయన అనుయాయుల సంఖ్య లక్షల్లోని మాటే. అంతిమ హజ్‌లో పాల్గొన్న వారి సంఖ్య 1 లక్షా 40 వేలంటారు. ఆయన తీసుకొచ్చిన మార్పుకి ఒక సామాన్య పౌరుని సాక్ష్యం అబిసీనియా రాజ దర్బారులో అందరి సమక్షంలో ఇవ్వబడినది.

ఆ కామన్ మ్యాన్ ఇస్లాం ధర్మాన్ని ఆశ్రయించినవారి తరఫున మాట్లాడుతూ ఇలా చెప్పనారంభించారు :

“రాజా! మేము పూర్వం అజ్ఞానులుగా ఉండి, విగ్రహాలను పూజించే వాళ్లం. అశ్లీలతా ఊబిలో పీకల్లోతుకు దిగబడి ఉండే వాళ్ళం, కామం, క్రోధం, మోహం, మదం, మత్సర్యం, మద్య సేవనం, మగువ లోలత్వం, దొంగతనం, దోపిడి లాంటి అవలక్షణాలకి పుట్టినిల్లుగా ఉండేది మా సమాజం. ఇవి చాలవన్నట్లు బంధుత్వ సంబంధాల విచ్చితికి పాల్పడటం మా దినచర్యగా ఉండేది. అలాంటి అంధకారంలో ఎటూ పాలుపోక కొట్టుమిట్టాడుతున్న మా కోసం అల్లాహ్ మా మధ్య - స్వయంగా మాలో నుండే తపో కిరణమైన ఓ ప్రవక్తను ప్రభవింపజేశాడు. మేము ఆయన గౌరవప్రదమైన వంశాన్ని, ఆయన సత్యసంధతను బాగా ఎరిగినవాళ్ళమే. మేమంతా అల్లాహ్ ఒక్కడే మనందరి నిజ పూజ్యనీయుడిగా ప్రభువుగా నమ్మాలని, విగ్రహారాధనను పరిత్యజించాలని, సదా సత్యమే పలకాలని, విశ్వసనీయతను

అలవర్చు కోవాలని, బంధుత్వాన్ని పటిష్ట పరచుకోవాలని ఆయన ఉపదేశించారు. అలాగే అవలక్షణాలకు, అనైతిక చేష్టలకు, అశ్లీల విషయాలకు, అక్రమార్జనకు, లంచానికి, అధర్మ ఆహార కంచానికి, పరపొందు మంచానికి దూరంగా మసలుకోవాలనీ, అనాథల సొమ్మును అన్యాయంగా తినకూడదని హెచ్చరించారాయన. మేము ఆయన్ని సత్య ప్రవక్తగా విశ్వసించాము, ఆయన తెలిపిన ప్రతి విషయాన్నీ మనసారా స్వీకరించాము.

"అయితే ఈ కారణంగానే మా జాతి వారు ఆగ్రహించి మమ్మల్ని హింసించారు. కఠిన పరీక్షలకు గురిచేశారు. మేము సత్యధర్మాన్ని వదలి తిరిగి విగ్రహారాధన చేయాలని, ఘర్ వాపసీ చేసి తీరాల్సిందేనని ఒత్తిడి తెచ్చి మా జీవితాలను దుర్భరం చేసారు. చివరకు మేము వారి దౌర్జన్యాలు, దౌష్ట్యాలు భరించలేక మీ దేశానికి మిమ్మల్ని నమ్మి వచ్చి తల దాచుకున్నాము. మీరు ఉండగా దేవుడు మాపై ఎటువంటి జులుం జరగకుండా చూస్తారని ఆశిస్తున్నాము" అని మాట పూర్తి చేశారు ఆ సామాన్య పౌరుడే హజ్రత్ జాఫర్ (ర).

మహనీయ ముహమ్మద్(స) - తౌహీద్ ప్రధాన ధర్మ ప్రకటనలో అందమైన నిర్మాణానికి చివరి ఇటుక వంటివారు. మానవ లోకంలో ఇస్లాం ధర్మ పరంపర ఆది మానవులు, ప్రవక్త అయిన ఆదమ్ ప్రవక్తతో ప్రారంభమయ్యింది. అనేక ప్రవక్తల గొలుసు క్రమంలో మహనీయ ముహమ్మద్ (స) చివరివారు. ముహమ్మద్ ప్రవక్త బోధనలకు ముందు వజ్ర సంకల్పులయిన ప్రవక్త నూహ్, ఇబ్రాహీమ్, మూసా, ఈసా (అలైహిముస్సలామ్) బోధనలు ఉన్నాయి. ముస్లిమేతరులు సాధారణంగా ఆయన్ను ఇస్లాం మత స్థాపకునిగా భావిస్తారు. కానీ ఇస్లాం ధర్మం ప్రారంభ మయినది ఆది పురుషుడయిన ఆదమ్ ప్రవక్తతో. ఆ విషయానికొస్తే సృష్టి చరాచరా లన్నింటిలో కానవచ్చే ధర్మం ఇస్లాం. ప్రకృతి అంతటి సహజమైన ధర్మం ఇస్లాం.

> **"అల్లాహ్ మానవులను ఏ స్వభావంపై పుట్టించాడో ఆ స్వభావం పైన్నే (ఉండండి)" (రూమ్: 30)**

'ఫిత్రత్' అంటే సహజత్వం లేక నైజం. అల్లాహ్ మానవుల్ని సహజ ధర్మం-ఇస్లాంపై, అల్లాహ్ ఏకత్వ భావన-తౌహీద్‌పై పుట్టించాడు. పుట్టుక రీత్యా ప్రతి మనిషి నైజంలో అల్లాహ్ ఏకత్వం- తౌహీద్ భావన అంతర్లీనమై ఉంది. జన్మతః ప్రతి మనిషి అల్లాహ్ విధేయుడిగానే (ముస్లింగానే) ఉంటాడు. కాకపోతే మనిషి పుట్టిన తర్వాత పరిసరాల, పరివార, పండితుల, స్నేహితుల, సాహిత్య ప్రభావానికి గురవుతాడు. తాను కళ్ళు తెరచిన సమాజంలోని కుళ్ళు అతన్ని సహజ ధర్మం వైపునకు మళ్ళకుండా చేస్తుంది. ఇదే యథార్థాన్ని ప్రవక్త(స) ఇలా తెలియజేశారు: "పుట్టే ప్రతి శిశువు ప్రకృతి ధర్మం మీదే పుడుతుంది. కానీ దాని తల్లిదండ్రులు ఆ శిశువును యూదునిగానో, క్రైస్తవునిగానో, అగ్ని పూజారిగానో మార్చి వేస్తారు". (బుఖారీ)

పోతే, ముస్లిమేతరులతో మహాప్రవక్త ముహమ్మద్ (స) ఎలా ఉండేవారు? అనే విషయాన్ని ముక్తసరిగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం!

ముస్లిమేతర సోదరులతో సత్సంబంధాలు, సహజీవన భావాలకు సంబంధించి ఇస్లాం రెండు మౌలిక దృక్పథాలను మన ముందుం చింది.

## మొదటిది: విశ్వమానవ సోదరభావం

> **మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీపురుష జంట నుండి పుట్టించాం. తర్వాత మీ పరస్పర పరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాం. అయితే మీలో అందరి కంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవ నీయుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞాని, సమస్త విషయాలు తెలిసినవాడు. (దివ్యఖుర్‌ఆన్ - 49 : 13)**

ప్రవక్త మహనీయులు(స) వివిధ సందర్భాలలో, వివిధ రకాలుగా ఈ విషయాన్ని విడమరచి చెప్పారు.

"ప్రజలంతా ఆదమ్ బిడ్డలే. ఆదమ్ మట్టితో చేయబడ్డారు." (మజ్మవుజ్జవాయెద్ - హదీసు నెం.13089).

దైవప్రవక్త (స) తన వీడ్కోలు హజ్జ్ సందర్భంగా ఇలా ఉపదేశించారు..

> **"ప్రజలారా! మీరందరి ప్రభువు ఒక్కడే. ఒక అరబ్బుకి అరబ్బేతరునిపై గానీ, ఒక అరబ్బేతరునికి అరబ్బుపై గానీ, ఒక తెల్లవానికి నల్లవానిపైగానీ, ఒక నల్లవానికి తెల్లవానిపైగానీ ఎలాంటి ఆధిక్యత లేదు - ఒక్క తఖ్వాతో తప్ప. మీలో ఎవరు ఎక్కువ దైవభీతిపరులో వారే అల్లాహ్ కు అత్యంత ప్రీతిపాత్రులు. (బైహఖీ)**

మానవులంతా ఒకే తల్లిదండ్రుల బిడ్డలన్న భావన రాగానే మానవ సోదర భావం దానంతట అదే జనిస్తుంది - వారు ఏ మతాన్ని నమ్మేవారయినా, ఏ వంశానికి చెందిన వారయినా, వారు తెల్లవారయినా, నల్లవారయినా- వారంతా అన్నదమ్ములే. అందుకే ఆయన (స) ఒకసారి ఈ విషయాన్ని విశదీకరిస్తూ, "ఆదమ్ సంతతి వారంతా అన్నదమ్ములే" అని నొక్కి వక్కాణించారు (అబూదావూద్).

## రెండవది : మనిషి పుట్టుకతో స్వేచ్ఛాజీవి, గౌరవనీయుడు

ప్రాపంచిక అనుగ్రహాలన్నీ ఒక వైపు.. మనిషి స్వేచ్ఛా మర్యాదలు ఒక్కటీ ఒక వైపు. అది లేకుండా... ఏ మనిషి అయినా తనని తాను ప్రేమించు కుంటాడు. తనకో విలువ ఉందని ప్రగాఢంగా నమ్ముతాడు. ఎదుటి వాళ్లకు తనెంత మర్యాద ఇస్తున్నాడో, తనకూ అంత మర్యాద దక్కాలని కోరుకుం టాడు. ప్రతీ మనిషి తనకో విలువ, గౌరవం, మర్యాద, అభిమానం ఉన్నాయని నమ్ముతాడు. ఎప్పుడైతే ఈ నమ్మకాలకు భంగం కలుగుతుందో అపుడు ఆత్మ గౌరవం దెబ్బతింటుంది. మనల్ని మనం ప్రేమించినంతగా మరెవరూ ప్రేమించలేరు. కనుకనే ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ఉపదేశిం చారు. నీ కోసం దేన్నయితే ఇష్టపడతావో దాన్నే నీ సోదరుని కోసం ఇష్టపడు. (నసాయి)

ప్రపంచంలో జరిగిన సంస్కరణోద్యమాల లక్ష్యం సమాజంలోని దురాచారా లను రూపుమాపడమే. ప్రజల్లో చైతన్యం కలిగించి, వారిలో మార్పు తీసుకు రావడానికి సంఘసంస్కర్తలు అనేక ఉద్యమాలు చేపట్టారు. నాడు దళితులను అంటరానివారిగా చూపుతూ, వారిని సమాజంలో హీనంగా చూసేవారు. దీన్ని ఎదిరించిన సంస్కర్తలు ఆయా వర్గాల అభ్యున్నతికి కృషి చేశారు. అలాంటి సంఘ శ్రేయోభిలాషుల్లో తొలి వరుసలో దైవ ప్రవక్తలు ఉంటే, ఆ ప్రవక్తలందరి లోనూ అగ్రగణ్యులు మహనీయ ముహమ్మద్ (స). అలాగే సమాజంలో గొప్ప మార్పుకి శ్రీకారం చుట్టిన రచనల్లో తొలి పంక్తిలో దైవ గ్రంథాలుంటే, దైవ గ్రంథాలన్నింటిలోనూ సింహ భాగం అల్లాహ్ అంతిమ ఖుర్ఆన్ సొంతం. శాశ్వత శాసనం అయిన దాని మాట ఏమిటంటే,

> **“మేము ఆదమ్ సంతతికి గౌరవం వొసగాము, నేలపైన మాత్రమే గాకుండా నీటిలో కూడా వారికి వాహనాలను ప్రసాదించాము. ఇంకా, వారికి పరిశుద్ధ మైన జీవనోపాధిని ప్రసాదించాము.” (బనీ ఇస్రాయీల్-70)**

ఇస్లాం దృష్టిలోనయినా, ఇస్లాం ప్రవక్త (స) దృష్టిలోనయినా సంయుక్తంగా ఉన్న విషయం ఏమంటే, ఒక వ్యక్తి- అతను ముస్లిమయినా లేక ముస్లిమే తరుడయినా- మానవుడైన కారణంగా గౌరవించదగినవాడు, మర్యాద ఇవ్వదగినవాడు. జగతిలో ఉన్న జీవన ఒనరులు కేవలం ముస్లింలవి కావు. మానవులంతా వాటికి హక్కుదారులే.

ఇస్లామీయ దృక్కోణం నుండి ముస్లింల-ముస్లిమేతరుల మధ్య సౌహార్ధ సంబంధాలకు పునాది వంటివి ఈ రెండు దృక్పథాలు. మహాప్రవక్త ముహమ్మద్ (స) తన సత్ప్రవర్తన ద్వారా, నియమాల ద్వారా దీనికి సంబంధించిన క్రియాత్మక నమూనాలు సమర్పించారు.

**(మిగతా వచ్చేవారం)**


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని ‘Geeturai Weekly’
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

15వ పేజీ తరువాయి...

# ముస్లిం ప్రాతినిధ్యం అత్యల్పం

సభ్యులలో ఒకరు ముస్లిం.

❖ 2009, 2022 మధ్య రాష్ట్ర వైద్య మండలిలో నమోదైన వైద్యుల సంఖ్య 7,968 కాగా, వారిలో 1,525 మంది ముస్లింలు ఉన్నారు.

❖ చట్టబద్ధమైన తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్‌లోని 29 మంది సభ్యుల్లో కేవలం ఇద్దరు ముస్లింలు మాత్రమే సభ్యులుగా ఉన్నారు.

❖ 423 మంది జిల్లా, సెషన్ జడ్జీలు/సీనియర్ సివిల్ జడ్జీలు/జూనియర్ సివిల్ జడ్జీలలో 17 మంది ముస్లింలు.

❖ హైదరాబాద్‌లో, సిటీ సివిల్ కోర్టు, సిటీ స్మాల్ కాజెస్ కోర్టు, మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు, సీబీఐ కోర్టు, ఇంటిగ్రేటెడ్ ఫ్యామిలీ కోర్టులలో మొత్తం 82 మంది న్యాయమూర్తులు ఉండగా అందులో ఏడుగురు ముస్లింలు ఉన్నారు.

❖ జనవరి 2024 నాటికి జిల్లాల్లోని అన్ని శాఖల మొత్తం 8,813 మంది అధికారుల్లో 502 మంది ముస్లిం వర్గానికి చెందినవారు. ఈ సంఖ్యలో కలెక్టర్లు, విభాగాధిపతులు, RDO, DRDOలు ఉన్నారు. SPలు మినహా పోలీసు అధికారులను మినహాయించారు.

❖ తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల 282 మంది ప్రిన్సిపాల్స్‌లో 15 మంది ముస్లింలు.

❖ 138 తెలంగాణ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల విభాగం స్టేషన్ ఫైర్ ఆఫీసర్లలో ఏడుగురు ముస్లింలు.

❖ 56 జిల్లా ఫైర్ ఆఫీసర్లలో ఇద్దరు మాత్రమే ముస్లింలు.

❖ మీ సేవా అధీకృత కేంద్రాల ఏజెంట్ల విషయానికి వస్తే, 4,525 మందిలో 455 మంది ముస్లింలు.

❖ తెలంగాణలోని మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న 1,463 మందిలో 126 మంది అధికారులు ముస్లింలు.

❖ రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో (టాప్ మేనేజ్‌మెంట్) 274లో ముస్లింలు 27 మంది.

❖ 1,053 (విద్యావేత్తలు)లో 70 మంది, పరిపాలనలో 644 మందిలో 24 మంది ముస్లిములు ఉన్నారు.

❖ నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) ప్రకారం తెలంగాణ ఖైదీలలో ముస్లింల వాటా 21.7 శాతంతో దేశంలోనే మూడో స్థానంలో ఉంది.

**(సోర్స్ : ది క్లారియన్ ఇండియా, నవంబర్, 3, 2024)**

# నమాజ్ ప్రాశస్త్యం

అల్లాహ్‌పై, దైవప్రవక్త(స)పై విశ్వాస ప్రకటన తర్వాత, అంటే విశ్వాస వచనం కలిమా తయ్యిబ పఠించిన తర్వాత ఒక విశ్వాసి నెరవేర్చాల్సిన ప్రథమ, ఆవశ్యకమైన విధి నమాజ్. దైవస్మరణలో నమాజ్ పాత్ర అత్యంత కీలకమైనది. ప్రతిరోజు ఐదుసార్లు విధిగా నిర్ణయించబడిన నమాజ్ ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ ఎన్నో ఖుర్‌ఆన్ ఆయత్‌లు, హదీసులు ఉల్లేఖించబడ్డాయి. దీంతోపాటు నమాజ్‌ను దైవధర్మ మూల స్తంభాలలో ఒకటిగా పేర్కొనడం జరిగింది.

నమాజ్‌ను ఒకవేళ పూర్తి శ్రద్ధాసక్తులు, భయభక్తులతో చదివితే దాని వల్ల ఆత్మ పరిశుద్ధమవడమేకాదు, ప్రతి చెడు నుండి మనిషి రక్షింపబడి ప్రతీ మంచిని అలవరచుకోవడానికి మార్గం సుగమవుతుంది. అందుకే ఇస్లాంలోని మిగతా విధుల కన్నా దీని ప్రాముఖ్యతపై అధికంగా చర్చించడం జరిగింది.

దైవప్రవక్త ముహమ్మద్(స) సమక్షంలో ఎవరైనా ఇస్లాం స్వీకరిస్తే మొట్టమొదట ఏకేశ్వరోపాసన గురించి బోధించిన తర్వాత నమాజ్ చదవాలనే ప్రమాణం తీసుకోవటం జరిగేది. కాబట్టి కలిమయె తయ్యిబా తర్వాత మొదటి ప్రాధాన్యం నమాజ్‌కే అనటంలో ఏమాత్రం సందేహం లేదు.

దైవ దాసునికి, తిరస్కారికి మధ్య నమాజ్ ఆచరించకపోవడమే అతి పెద్ద భేదం. అంటే దాసుడు ఒకవేళ నమాజ్ ఆచరించకపోతే అతను తిరస్కారంలో పడినట్టే. నమాజ్ ఆచరించకపోవటం తిరస్కార వైఖరికి నిదర్శనమే.

ఎవరైతే నమాజ్‌ను సక్రమంగా, ఉత్తమంగా ఆచరిస్తారో అతని కొరకు ప్రళయదినాన నమాజ్ ఒక వెలుగుగా ఉద్భవిస్తుంది. అతని విశ్వాసానికి ప్రమాణమై మోక్షానికి మార్గమవుతుంది. నమాజ్ ఆచరించని వ్యక్తి ప్రళయదినాన ఖారూన్, ఫిరౌన్‌లతో ఉంటాడు. (ముస్నద్ అహ్మద్)

**- ముహమ్మద్ వహీదుద్దీన్**

అయ్యూబ్ బాషా,
నంద్యాల



# స్వేచ్ఛ అంటే?

**సత్యనారాయణ, రాఘవయ్య ఇద్దరూ స్నేహితులు.** వీరిద్దరూ రిటైర్డు ఉద్యోగులు. పార్కులో వాకింగ్ చేసి సేద తీరుదామని ఒక చోట కూర్చున్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలు చర్చించుకుంటున్నారు.

ఈ సెల్ ఫోన్ వచ్చి గడియారాన్ని, టార్చ్ లైట్‌ను, పోస్టు కార్డుల్ని, పుస్తకాల్ని, కాలిక్యులేటర్‌ను తినేసింది, రేడియోను, టేప్‌రికార్డర్‌ను మింగేసింది, కెమెరాను మాయం చేసింది, ఇరుగుపొరుగు వారితో సంబంధాలను తెంచేసింది, ఇంట్లో కూడా ఒకరికి ఒకరు మనసు విప్పి మాట్లాడుకునే అవకాశం లేకుండా చేసింది. ఎవరి గదులలో వాళ్ళు బందీ అవుతున్నారు. ఎప్పుడో భోజనాలకి తప్పితే బయటికి రారు. చివరకు మన మెమొరీని కూడా తినేసింది.

టీవీ లేదు, ఆట లేదు, పాట లేదు... ఇదే బ్యాంకు, ఇదే హోటల్, ఇదే కిరాణ షాపు... ఇదే డాక్టర్.

అసలు మార్కెట్ అంటేనే ఇది. చూపుడు వేలు ప్రపంచాన్ని, మనిషి జీవితాన్ని శాసిస్తోంది...

నోరు మ్యూట్‌లో ఉంది. ఎస్, నిజమే. టచ్‌తోనే జీవితం. కానీ ఎవరూ టచ్‌లో లేరు..

ఈ సెల్ ఫోను వల్ల ఉపయోగాల కంటే అనర్థాలే ఎక్కువ ఉన్నాయి. మనిషికి అరచేతిలో ఉండాల్సిన చరవాణి మనిషిని తన చెప్పు చేతుల్లో పెట్టుకొని ఆడిస్తుంది.

సోషల్ మీడియాలో కొత్త పరిచయాల కోసం హద్దు దాటి ప్రవర్తిస్తున్నారు. ఇందులో ప్రాచుర్యం పొందాలని విలువలను వలువల్లా ఊడదీస్తున్నారు. స్వేచ్ఛగా ఏదైనా చెయ్యొచ్చు అనే ధైర్యం యువకులకు కలుగుతుంది. దీనివల్ల ప్రభావితం అయ్యి వారి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారు. అందరిలో ఫేమస్ కావాలని వాహనాలతో రకరకాల విన్యాసాలు, పందేలు

వేసుకొని ప్రాణాలు మీదకు తెచ్చుకొని తల్లిదండ్రులకు కడుపు కోత మిగిలిస్తున్నారు. అమ్మాయిలు ప్రముఖుల దృష్టిలో పడాలని రకరకాల వ్యాంపు పాటలకు సిగ్గు విడిచి సినిమాలో చేసినట్టు డ్యాన్సులు చేస్తున్నారు. గృహిణులు ఏమి తక్కువ తినలేదు వీరు అంతకుమించి చేస్తున్నారు. బంధువులు ఇరుగుపొరుగు వారు వాళ్లను చూస్తారనే కనీసం ఇంగిత జ్ఞానం కూడా లేకుండా చెలరేగి పోతున్నారు. ఎన్నో కుటుంబాలు విచ్ఛిన్నం కూడా అవుతున్నాయి. ఈ సోషల్ మీడియా ద్వారా ప్రభావితమై యువకులు దారి తప్పుతున్నారు.

ఈ రోజు వార్త చూశావా. నిండా 16 ఏళ్లు నిండని ముగ్గురు కుర్రాళ్ళు మందు తాగుతూ గొడవపడి ఇద్దరు కలిసి మూడో వాడిని గొంతు కోసి చంపేశారు. చాలా దారుణం కదా. మరో మైనర్ కుర్రాడు కుటుంబ సభ్యుల నగ్న చిత్రాలను పోర్న్ సైట్స్‌కు అమ్ముకున్నాడు. ఇంకొక మైనర్ కుర్రాడు సెల్ ఫోన్ ఆడుకోవ డానికి ఇవ్వడం లేదని ఇంట్లో ఉన్న విలువైన గృహోపకరణా లను ధ్వంసం చేశాడు. తల్లిదండ్రులు ఎదిగే పిల్లల మీద ఓ కన్నేసి ఉంచకుంటే ఇటువంటి పరిణామాలు సాధారణమై పోతాయి. ఎదిగే పిల్లలకు నైతికత సమానత అంశాలు అర్థమయ్యేలా, సామాజిక బాధ్యతలను కూడా వివరించాలి. నేరం జరిగితే నిజానిజాలు నిర్ధారణ చేసుకోకుండా ఓ వర్గాన్ని నిందించడం, కించపరిచే వ్యాఖ్యలు చేయటం, విద్వేషాన్ని రేపి మత కల్లోలాలు రేపటం ఓ వర్గానికి సాధారణం అయిపోయింది.

సోషల్ మీడియా పెద్దల జీవనోపాధిని కూడా ప్రభావితం చేస్తుంది. దురదృష్టవశాత్తూ, చాలా మంది ఈ యాప్‌లలో ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తారు, వారు తమ రోజువారీ పనులను పూర్తి చేయలేరు లేదా వారి కెరీర్‌ను కూడా ప్రారంభించరు. సోషల్ మీడియాలో ఇతరులు డబ్బు సంపాదిస్తున్నారు కాబట్టి, వారు ఆదాయం కోసం కూడా దానిపై ఆధారపడవచ్చని కొందరు నమ్ముతారు. ఇది అందరికీ సాధ్యపడదు. కొన్ని లోన్ యాప్‌లు చేసే మోసాల వల్ల అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. జీవితాన్ని అర్థం లేనిదిగా భావించడం వలన వారి మానసిక ఆరోగ్యం దెబ్బ తింటుంది. కొంతమంది తెలిసి తెలియక షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెడతారు నష్టాలు వస్తే ఎవరికి చెప్పుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

సోషల్ మీడియా దాని సానుకూల అంశాలను కలిగి ఉన్నప్పటికీ- ప్రజలు డబ్బు సంపాదించగలగడం వంటివి వారి ఏకైక ఆదాయ వనరుగా ఉండకూడదు. మరికొందరు ఆన్‌లైన్ డేటింగ్ ద్వారా జీవిత కాలం కొనసాగే కనెక్షన్‌లను కనుగొంటారు. కొందరు వాస్తవానికి సోషల్ మీడియా యాప్‌ల ద్వారా కలుసుకోవడం, వివాహం చేసుకోవడం. అయినప్పటికీ, ఇప్పటికే మానసిక ఆరోగ్య సమస్యలతో పోరాడుతున్న వారికి, సోషల్ మీడియా వారి సమస్యలను మరింత తీవ్రతరం చేస్తుంది.

తెల్లారగానే సోషల్ మీడియాలో తల దూర్చేస్తారు. ఒక అరగంట అది లేకుంటే బతకలేము అన్నట్టు ప్రవర్తిస్తారు. ఇది శారీరక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది, అయితే వారి మానసిక స్థితి క్షీణిస్తుంది.

2012లో నిర్భయ ఘటన అనంతరం, అత్యాచారాలకు కఠిన శిక్షను విధించేలా చట్టంలో మార్పులు చేశారు. ఈ శిక్షతో నేరస్తులు భయపడిపోతారని, తద్వారా అత్యాచారాలు తగ్గుతాయని భావించారు. ఈ చట్టం అమలులోకి వచ్చాక, నిర్భయ, శక్తి మిల్ సామూహిక అత్యాచార నిందితులకు మరణశిక్ష విధించారు.

కానీ తరువాత జరిగిందేమిటి? జాతీయ నేర రికార్డుల బ్యూరో గణాంకాల ప్రకారం 2015లో 34,651 అత్యాచార కేసులు, 2016లో 38,947 అత్యాచార కేసులు నమోదయ్యాయి. 2012లో ఈ సంఖ్య 24,923 మాత్రమే. అంటే, రెండు అత్యంత తీవ్రమైన అత్యాచార ఘటనల్లో దోషులకు మరణశిక్ష విధించిన తర్వాత కూడా అత్యాచారాల సంఖ్య పెరిగిందే కానీ తగ్గలేదు. నిర్భయ ఘటన అనంతరం జస్టిస్ వర్మ కమిటీ నివేదిక ప్రకారం రేప్ కేసులను నమోదు చేసే విషయంలో కూడా అనేక సంస్కరణలు తీసుకువచ్చారని మనం గుర్తుంచుకోవాలి.

హత్యలు, ఆత్మహత్యలు, వేధింపులు, అత్యాచారాలు, మోసాల సంఖ్య పెరగడానికి సోషల్ మీడియా కూడా ఒక కారణం. అశ్లీల వెబ్‌సైట్లను నిషేధించి సైబర్ నేరాలను తగ్గించేలా, భావి తరానికి దిశా నిర్దేశం చేసేలా ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చట్టాలు తీసుకు రావాలి.

స్వేచ్ఛ అంటే తన మనోవాంఛలకు లోబడి నడుచుకోవడం కాదు. తన మనో వాంఛలకు సంకెళ్లు వేసి దైవాదేశానుసారం నడుచు కోవడం అదియే నైతిక స్వేచ్ఛ. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా వివరించాలి. ❖




**అనగనగా** ఒక రాజు ఒకసారి తన మందీ మార్బలంతో కలసి వేట కోసం అడవికి బయలుదేరాడు. కాని ఆ రాజు వేటాడుతూ వేటాడుతూ అందరికంటే ముందుకు వెళ్ళిపోయి దారి తప్పిపోయాడు. ఆయనగారితోపాటు వెళ్ళిన వారందరూ రాజు గారిని వెదుకుతూ అటుఇటూ తిరుగుతూ ఉండిపోయారు. రాజు గారికి అక్కడ దట్టమైన అడవి తప్ప మరేమీ కనబడటంలేదు. రాజు గారు తీవ్రమైన ఆందోళనకు గురై మానవ మాత్రుడెవడైనా కనబడతాడేమోనని చుట్టూ చూశారు. తిరిగి తిరిగి దాహంతో ఆయన గారి నాలుక పిడచగట్టుకు పోతోంది. చివరకు అడవి లోపల ఒక వైపు నుంచి వీణ వాయిస్తూ ఉన్న స్వరం వినిపించింది. ఆయన వెతుక్కుంటూ అటువైపు వెళ్ళి చూడగా అక్కడ ఒక పశువుల కాపరి కనిపించాడు. వడివడిగా అతని వైపు అడుగులు వేసుకుంటూ వెళ్ళి అతనికి కొంచెం నీళ్ళు ఉంటే ఇవ్వమనీ ప్రాధేయపడ్డాడు రాజు. అతను ఎవడో ప్రయాణీకుడని భావించి, దయ తలచి తన వద్ద ఉన్న మట్టి కూజా లోని నీళ్ళను తాగమని ఇచ్చాడు. రాజు గటగట నీళ్ళన్నీ త్రాగి ఊపిరి పీల్చుకున్నాడు. చివరకు ఆ పశువుల కాపరి అడవిలో దారి కూడా చూపించాడు. అతను చేసిన సహాయానికి రాజు ఎంతో సంతోషించి అతనికి బహుమతులు ఇవ్వాలని భావించాడు. ఒక చెట్టు బెరడు మీద బొగ్గుతో తన పేరును రాసి నేను ఫలానా దేశానికి రాజు అని ఇది తీసుకుని తన వద్దకు వస్తే బహుమానాలతో సత్కరిస్తానని చెప్పాడు. ఆయన రాజు అని తెలుసుకున్న పశువుల కాపరి చాలా సంతోషించాడు.

చివరకు ఒకరోజు ఆ పశువుల కాపరి రాజదర్బారుకు చేరుకున్నాడు. అతని రాక కోసం అక్కడి వారు ఎదురు చూస్తూనే ఉన్నారు. అతన్ని తీసుకుని రాజుగారి వద్దకు తీసుకువెళ్ళారు. అప్పుడు ఆ రాజు గారు దైవ ఆరాధనలో నిమగ్నమై ఉన్నారు. అతను ఆ రాజు గారి వైపు వేచి చూస్తూ ఉన్నాడు. ఆ రాజు గారు రెండు చేతులూ పైకెత్తి వెక్కి వెక్కి ఏడుస్తూ వేడుకుంటున్నారు. అది చూసి ఆ కాపరి ఆశ్చర్యా నికి గురయ్యాడు. ఇదేమిటి రాజు గారు ఎందుకు ఏడుస్తున్నారు? ఎవరిని అడుగుతున్నారు? అని అక్కడి వారిని అడిగాడు.

వారు అతనికి రాజుగారు అల్లాహ్‌ను వేడుకుంటున్నాడు. ఆయన తనను క్షమించమని, తన అవసరాలు తీర్చమని, తనకు సహాయ పడమని అల్లాహ్‌ను కోరుకుంటున్నారు అని విశ్లేషించారు. అది విన్న ఆ పశువుల కాపరి వెంటనే వెనుదిరిగి వెళ్లిపోసాగాడు. దర్బారు లోని సహాయకులు ఏమిటి రాజు గారి నుంచి ఏమీ తీసుకోకుండానే వెళ్ళిపోతున్నావు అని అడిగారు. దానికి అతను రాజు గారి వద్దే ఏమీ లేదు కదా! ఆయనే అల్లాహ్‌ను ఇవ్వమని వేడుకుంటున్నారు. అలాంటప్పుడు నేను ఆయన్ని ఏం కోరాలి? ఆయన వేడుకుంటున్న అల్లాహ్‌నే నేను ఎందుకు వేడుకోకూడదు? నేను కూడా ఆ ప్రభువు నుంచే అడిగి తీసుకుంటాను అని సంతోషంతో, ఉత్సాహంతో అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

దీనిద్వారా తెలిసిన విషయమేమిటంటే, ఎంత పెద్ద రాజైనప్పటికీ ఆయన చేతుల్లో ఏమీ ఉండదు. కేవలం అల్లాహ్ వద్ద తప్ప. రాజు కూడా అగత్యపరుడే. కనుక ఒక విశ్వాసి తన నిజ ప్రభువు అల్లాహ్‌ను మాత్రమే వేడుకుంటాడు. ఆయన ముందే తల వంచుతాడు. ఆ తరువాత ఏది ఏమైనా ప్రశాంతంగా తన జీవితం గడుపుతూ ఉంటాడు.

నేటి ప్రపంచంపై దృష్టిని సారిస్తే అధిక శాతం ప్రజలు జీవితంపై విరక్తి కలిగినవారు, అయిష్టంగానే జీవితాన్ని నెట్టుకువస్తున్నవారు, భారంగా జీవితం గడుపుతున్నవారు కనిపిస్తారు. వాస్తవానికి వారికి విద్య, జ్ఞానం లేక కాదు, వారిలో నైపుణ్యాలు లేవని అసలే కాదు. స్పష్టంగా తెలిసే విషయమేమిటంటే, వారి హృదయాలలో అచంచల మైన దైవ విశ్వాసం లేదు, అల్లాహ్‌పై పూర్తి నమ్మకం లేదు. జీవితంపై

ఎలాంటి ఆశా కిరణాలు లేవు. కనుకనే వారి పరిస్థితి ఇలా తయారవుతుంది. అంతేకాదు, వారు రోజు రోజుకు దీనావస్థకు చేరుకుంటూ ఉంటారు. తనను తాను నిందించుకుంటూ ఉంటారు. ఈ ప్రపంచంలో జీవితం గడపడానికి నాకు చేత కావటంలేదని, నాలో ఏ మంచీ లేదని, నాకు ఏ జ్ఞానం లేదని నా వద్ద ఏ నైపుణ్యామూ లేదని తమలో తామే వారు నిందించుకుంటూ ఉంటారు.

వాస్తవ విషయమేమిటంటే, ఒకవేళ ఒక చేపను నీళ్ళ నుంచి బయటకు తీసివేసి, దాన్ని నీళ్ళ బయటే ఉంచినట్లయితే అది బాధతో గిలగిల్లాడి చివరకు ప్రాణాలే విడిచిపెట్టేస్తుంది. ఎందుకంటే నీళ్ళే చేప జీవనాధారం. నీళ్ళు లేకుండా అది కొంత సమయం కూడా ప్రశాంతంగా జీవించలేదు. అదేవిధంగా మనిషి జీవనాధారం అల్లాహ్‌పై అచంచలమైన విశ్వాసం. మనిషి హృదయంలో నుంచి గనక అల్లాహ్‌పై విశ్వాసం సన్నగిల్లినట్లయితే అతని జీవిత నౌక కూడా ఒడిదుడుకులకు గురవుతుంది. అతను క్రమక్రమంగా విలవిల్లాడి అవిశ్వాస సముద్రంలో మునిగిపోయి అంతమైపోతాడు.

ఈ ఉదాహరణ ద్వారా తెలిసిన విషయమేమిటంటే ఏ విధంగానైతే చేపకు సముద్రపు నీరు ఎలా అవసరమో మనిషికి అల్లాహ్‌పై విశ్వాసం అంతే అవసరం. ఇది నగ్న సత్యం. ఈనాడు మనిషి అశాంతికి గురై మనశ్శాంతిని కోల్పోవటానికి బలహీనమైన దైవ విశ్వాసమే అసలైన మూల కారణం. మనిషి జీవితానికి సంబంధించిన ఏ కారణంగానైనా సరే అతను మానసిక రోగపు సముద్రపు అంచుల వరకు చేరుకున్నాడంటే అతను వెంటనే జాగరూకత చెందాలి. దానినుంచి బయట పడటానికి విశ్వాసపు అహ్లాదకరమైన ఒడ్డుకు చేరుకోవాలి. అశాంతి అలలు తనను సముద్రపు లోతులలో లాక్కొని వెళ్ళకుండా జాగ్రత్తపడాలి. అల్లాహ్ వైపునకు మరలాలి. తన పాపపు కార్యాలను, తన తప్పిదాలను జ్ఞాపకం చేసుకుని క్షమాపణ కోరుకోవాలి. తద్వారా వారి జీవితం ప్రశాంతత వైపునకు క్రమక్రమంగా మరలటం ప్రారంభమవుతుంది.

ఈనాడు కూడా మనకు ఎంతో మంది జీవిత గాథలు కనబడతాయి. వారు ఏదో ఒక ఆపదకు, ఏదో ఒక దైవ పరీక్షకు గురైనప్పుడు దాని కారణంగా మానసిక ఒత్తిడికి గురై తీవ్రమైన మానసిక క్షోభను అనుభవించిన తరువాత అల్లాహ్ వైపునకు మరలి దుఆలను ఆధారంగా చేసుకోవటం ద్వారా తిరిగి మరలా సాధారణ జీవితం గడుపుతూ ఉన్నారు.

ఈ ప్రపంచంలో ప్రతి మనిషి ఏదో ఒక ఆపదకు, అనారోగ్యానికి, కష్టానికి, నష్టానికి గురవుతూనే ఉంటాడు. ఎందుకంటే ఈ జీవితమే మనిషికి ఒకపరీక్షగా ప్రసాదించబడింది. ఒకవేళ ఎవరైనా తన జీవితంలో ఎలాంటి కష్టనష్టాలు రాకూడదనీ, తనకు ముల్లు కూడా గుచ్చుకోకుండా ప్రశాంతమైన జీవితం గడపాలని భావించినట్లయితే అతని ఈ ఆశలు అడియాశలే అవుతాయి తప్ప అతని ఈ కోరిక ఈ ధరణిపై ఎంత మాత్రమూ తీరదు. అది కేవలం పరలోకంలోనే, స్వర్గంలోనే సాధ్యమవుతుంది. ఇతరుల జీవితాన్ని దూరం నుంచి చూసి ఎదుటివారు ఎంతో సంతోషంగా ఉన్నారు అని భావించటం, తనకే అన్ని కష్టాలు ఎదురవుతున్నాయని అనుకోవటం దూరం నుంచి ఎండమావులను చూసి భ్రమపడటం వంటిది.

కాని సాధారణంగా జరిగే విషయమేమిటంటే మనిషి సుఖ సంతోషాలతో జీవితం గడుపుతూ ఉన్నంత కాలం అతని చుట్టుప్రక్కల వాళ్ళు, చుట్టాలు, దూరపు బంధువులు, సన్నిహితులు, స్నేహితులు అందరూ తీపి చుట్టు ఈగలు వాలినట్లుగా అతని చుట్టు తిరుగుతూ ఉంటారు. అతని సాన్నిహిత్యాన్ని, అతనితో తన సంబంధాన్ని గొప్పగా చెప్పుకుంటూ ఉంటారు. కాని అకస్మాత్తుగా అతను ఏదైనా ఆపదకు గురైతే అప్పటివరకు చుట్టూ తిరిగినవారే మెల్లిమెల్లిగా అతని వద్ద నుంచి జారుకుంటారు. అతనికి అతని బాధకంటే ప్రజల ఈ నడవడిక అధిక బాధను కలిగిస్తుంది. ఇంకా ఆ బాధ అతనికి మానసిక ఒత్తిడికి గురిచేస్తుంది. కనుకనే పచ్చి దారంతో కట్టబడి ఉండే ఈ బంధాలు, బాంధవ్యాలపై అధిక ఆశలు పెట్టుకోకుండా కలకాలం దృఢంగా ఉండే అల్లాహ్‌తో బంధాన్ని పటిష్టం చేసుకోవాలి. ఆశలన్నీ ఆయనపైనే పెట్టుకోవాలి. ఎందుకంటే అవసరమైనప్పుడు ఆయన తప్పకుండా ఆదుకుంటాడు.

ఈ విషయాన్ని అల్లాహ్ తన గ్రంథంలో ఇలా సెలవిచ్చాడు : బాధితుడు మొరపెట్టుకున్నప్పుడు అతని మొరను ఆలకించి అతని బాధను తొలగించేవాడు ఎవడు? భూమిపై మిమ్మల్ని ప్రతినిధులుగా చేసినవాడు ఎవడు? అల్లాహ్‌తోపాటు (ఈ పనులు చేసే) మరొక దేవుడు కూడా ఎవడైనా ఉన్నాడా? మీరు చాలా తక్కువగా ఆలోచిస్తారు. (27: 62)

ఈ గ్రంథంలోనే అల్లాహ్ తన ప్రవక్తలు తనకు మొరపెట్టుకున్న వారి గాథలను కూడా చాలా స్పష్టంగా తెలియజేశాడు. హజ్రత్ ఆదమ్(అ) తన పొరపాటును మన్నించమని అల్లాహ్‌నే మొర పెట్టుకున్నారు. హజ్రత్ యూనుస్(అ) చేప కడుపులోనుంచి ఎలుగెత్తి అల్లాహ్‌నే పిలిచారు. హజ్రత్ యూసుఫ్(అ) దుర్మార్గపు స్త్రీల నుండి తనను కాపాడుకోమని అల్లాహ్‌నే ప్రాధేయపడ్డారు. హజ్రత్ అయ్యూబ్(అ) తను వ్యాధిలో ఉన్నప్పుడు అల్లాహ్‌నే వేడుకున్నారు. హజ్రత్ లూత్(అ) తన నిస్సహాయ స్థితిలో అల్లాహ్‌నే వేడుకున్నారు. హజ్రత్ జకరియ్యా(అ), హజ్రత్ ఇబ్రాహీమ్(అ) సంతానాన్ని ప్రసాదించమని అల్లాహ్‌నే మొరపెట్టుకున్నారు. హజ్రత్ మూసా(అ) ఫిరౌన్ రాజు దుర్మార్గం నుంచి తన జాతి ప్రజలను రక్షించమని అల్లాహ్‌నే ప్రాధేయపడ్డారు.

ఈ విధంగా చెప్పుకుంటూ పోతే ప్రవక్తలందరూ కేవలం ఒకే ఒక అల్లాహ్‌ను మాత్రమే సహాయపడమని వేడుకున్నారు తప్ప మరెవ్వరి ముందు చెయ్యి చాచలేదు. తలవంచలేదు. కారుణ్య ప్రభువు వారందరి దుఆలను ఆలకించాడు. వారికి సహాయ సహకారాలను అందించాడు. వారి అవసరాలను, వారి కోరికలను తీర్చాడు. దీనిద్వారా మనకు తెలిసిన విషయమేమిటంటే, ఈనాడు మనం కూడా ఆపదలలో, అవసరాలలో, సుఖాలలో, సంతోషాలలో కేవలం ఒకే ఒక అల్లాహ్‌ను ఎలుగెత్తి పిలవాలి. ఎవరివైపు ఆశా దృష్టితో చూడకూడదు.




## 25 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నవంబరు 25 నుంచి డిసెంబరు 20 వరకు జరగనున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఈ సమావేశాల్లో భాగంగా రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు అవుతున్న సందర్భంగా నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. సంవిధాన్ సదన్(పార్లమెంట్ పాత భవనం) సెంట్రల్ హాల్ ఇందుకు వేదిక కానుందని వెల్లడించారు. 18వ లోక్‌సభ ఏర్పడిన తర్వాత ఇవి మొదటి శీతాకాల సమావేశాలు. ఈ సమావేశాల్లోనే కేంద్రం ఒకే దేశం-ఒకే ఎన్నిక, వక్ఫ్ బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్టు తెలిసింది. గత సమావేశాల్లోనే కేంద్రం వక్ఫ్ బిల్లును తీసుకువచ్చింది. అయితే.. భాగస్వామ్య పక్షాలు, విపక్ష పార్టీల డిమాండ్ల మేరకు సమగ్ర చర్చకుగాను బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)కి పంపేందుకు ప్రభుత్వం ప్రతిపాదించింది. కాగా, ఖాళీగా ఉన్న డిప్యూటీ స్పీకర్ పదవిని భర్తీ చేయాలని, దేశ వ్యాప్తంగా కుల గణన నిర్వహించాలని ఈ సమావేశాల్లో ప్రతిపక్షాలు డిమాండ్ చేసే అవకాశం ఉంది.

## తాజ్‌మహల్ సమీపంలోని పార్కు ఓ రైతు స్వాధీనంలోకి!

ఆగ్రాలో మెహతాబ్ బాగ్ సమీపంలోని గ్యారహ్ సీదీ పార్క్ నుంచి తాజ్‌మహల్ అందాలను చూస్తుంటే కనుల విందుగా ఉంటుంది. అదే సూర్యాస్తమయం సమయంలో అయితే వాహ్ తాజ్! అనేలా సీన్ ఉంటుంది. దీంతో ఆ ప్రాంతం పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తోంది. అయితే యమునా నది ఒడ్డున ఉండే ఈ గ్యారహ్ సీదీ పార్క్ విషయంలో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ పార్కులోని కొంత భూమి తనదని, తన పూర్వీకుల ఆస్తి అని, 40 ఏళ్ల పాటు సాగిన న్యాయ పోరాటంలో తాను గెలిచానని పేర్కొంటూ మున్నా లాల్ అనే స్థానిక రైతు.. ఆ పార్కులోకి పర్యాటకులు రాకుండా నిషేధించాడు. తనదని చెబుతున్న 6 బిగాల (దాదాపు 2.4 ఎకరాలు) భూమిని తన నియంత్రణలోకి తీసుకొని, చుట్టూ కంచె వేసేశాడు. అయితే తాజా వివాదంపై ఆగ్రా డివిజనల్ కమిషనర్ రితూ మహేశ్వరి స్పందిస్తూ.. వివాదంలోని భూమి ఆగ్రా డెవలప్‌మెంట్ అథారిటీ (ఏడీఏ) పరిధిలోకి వస్తుందని చెప్పారు. తాజా పరిణామాలపై విచారణ కొనసాగుతోందని చెప్పారు.

## ఐఎస్‌ఏ అధ్యక్ష స్థానంలో మళ్లీ భారత్

అంతర్జాతీయ సౌర విద్యుత్తు కూటమి (ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్-ఐఎస్‌ఏ ) ప్రెసిడెంట్‌గా భారత్ మళ్లీ ఎన్నికయింది. 2026 వరకు రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనుంది. ఉపాధ్యక్ష పదవికి ఫ్రాన్స్ ఎన్నికయింది. సోమవారం ఇక్కడ జరిగిన ఐఎస్‌ఏ ఏడో జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఈ విషయాన్ని ప్రకటించారు. సౌర విద్యుత్తు రంగానికి ప్రధాని మోదీ చేస్తున్న కృషి కారణంగానే ఈ గుర్తింపు సాధ్యమయిందని తెలిపారు. స్టాండింగ్ కమిటీకి చెందిన ఎనిమిది వైస్‌ప్రెసిడెంట్ స్థానాలు కూడా భర్తీ అయ్యాయి. ఆఫ్రికా ప్రాంతం నుంచి వైస్ ప్రెసిడెంట్లుగా ఘనా, సీషెల్స్ ఎన్నిక కాగా, వాటికి సహకరించే వైస్ చైర్స్ దేశాలుగా దక్షిణ సూడాన్, కామరాన్ దేశాలు ఎన్నికయ్యాయి.

## మదర్సాలకు సుప్రీం ఊరట

మదర్సాల్లో నాణ్యమైన విద్యను బోధించేలా, అర్హులైన ఉపాధ్యాయులను నియమించేలా, పరీక్షలు నిర్వహించేలా చూసేందుకు యూపీ సర్కారు 2004లో రూపొందించిన 'ఉత్తరప్రదేశ్ బోర్డ్ ఆఫ్ మదర్సా ఎడ్యుకేషన్ యాక్ట్ 2004' రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. రాజ్యాంగంలోని 14, 21ఏ అధికరణలకు, లౌకిక సూత్రాలకు విరుద్ధమని పేర్కొంటూ గతంలో అలహాబాద్ హైకోర్టు ఈ చట్టాన్ని కొట్టేస్తూ ఇచ్చిన తీర్పును తోసిపుచ్చింది. విద్య నాణ్యతను నియంత్రించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని.. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్‌మిశ్రాతో కూడిన ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ చట్టం రాష్ట్రప్రభుత్వ శాసనాధికార పరిధిలోనే ఉందని స్పష్టం చేసింది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఉమ్మడి జాబితాలోని అంశాల్లో 25వది విద్య అని గుర్తుచేసింది. అయితే.. మదర్సాల్లో ఉన్నతవిద్యకు సంబంధించి ఇచ్చే 'ఫాజిల్(డిగ్రీతో సమానం)', 'కామిల్ (పీజీతో సమానం)' మాత్రం యూజీసీ చట్టానికి, కేంద్ర జాబితాలోని 66వ అంశానికి విరుద్ధమని, కాబట్టి వాటిని రాజ్యాంగ విరుద్ధంగా పరిగణించవచ్చని వ్యాఖ్యానించింది. సుప్రీం తీర్పును ముస్లిం మత సంస్థలకు చెందిన పెద్దలు, బీఎస్పీ అధినేత్రి మాయావతి, సమాజ్‌వాదీ పార్టీ నేతలు స్వాగతించారు.

సర్వత్రా

## స్పెయిన్ రాజుకు చేదు అనుభవం

ఇటీవల స్పెయిన్‌లో ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. దేశ చరిత్రలో అత్యంత దారుణమైన ప్రకృతి విపత్తుల్లో ఇదీ ఒకటి. దాదాపు 200 మందికి పైగా మృతి చెందారు. వాలెన్సియా శివారులోని పైపోర్టా ప్రాంతంలోనే 60 మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది నివాసాలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలోనే వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనకు వెళ్లిన స్పెయిన్ రాజు ఫెలిప్-6కు చేదు అనుభవం ఎదురైంది. వరద బాధితులంతా ఆగ్రహంతో రాజుతోపాటు అధికారులపై బురద జల్లారు. అంతటితో ఆగకుండా దుర్భాషలాడినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. "వెళ్లిపోండి.. వెళ్లిపోండి.. హంతకులారా" అంటూ విరుచుకుపడ్డారు. దాదాపు అరగంట పాటు కొనసాగిన ఉద్రిక్తతల అనంతరం రాజు అక్కడినుంచి వెనుదిరిగారు.

## పాలస్తీనా శరణార్థుల సంస్థతో సంబంధాలు తెగతెంపులు

పాలస్తీనా శరణార్థుల కోసం పనిచేసే ఐక్యరాజ్య సమితి సంస్థ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ)తో సంబంధాలు తెగతెంపులు చేసుకుంటున్నట్లు ఇజ్రాయల్ ఐక్యరాజ్య సమితికి తెలియజేసింది. ఆ సంస్థను నిషేధించాలంటూ ఇజ్రాయిల్ ఎంపీలు ఓటు వేసిన అనంతరం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. విదేశాంగ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ ఆదేశాల మేరకు, యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎతో ఇజ్రాయిల్‌కు గల ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు తెలియచేశామని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. గతేడాది అక్టోబరు 7నాటి దాడుల్లో యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ ఉద్యోగులు పాల్గొన్నారని, చాలా మంది హమాస్ కార్యకర్తలుగా పని చేస్తున్నారని కట్జ్ పేర్కొన్నారు. గాజా సమస్యలోనే యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ ఒక భాగంగా వుందని వ్యాఖ్యానించారు. ఇజ్రాయిల్‌లో, ఆక్రమిత తూర్పు జెరూసలేంలో ఈ సంస్థ కార్యకలాపాలు నిలిపివేయడానికి గత నెల్లో ఇజ్రాయిల్ పార్లమెంట్ ఆమోదించింది. మిత్రపక్షమైన అమెరికాతో సహా అంతర్జాతీయ సమాజం ఈ చర్యను ఖండించినా పట్టించుకోలేదు. ఇప్పటికి ఏడు దశాబ్దాలకుపైగా ఈ సంస్థ ప్రపంచంలో ఎక్కడున్నా పాలస్తీనా శరణార్థులకు, అలాగే పాలస్తీనా భూభాగాల్లోని ప్రజలకు కీలకమైన సాయాన్ని అందచేస్తూ వస్తోంది. తాజా నిర్ణయంతో గాజాలో మానవతా సాయానికి పెద్ద ఎదురు దెబ్బ అవుతుంది. ఇజ్రాయిల్ దాడుల్లో బతికి బట్టకట్టిన వారిని కరువు కాటకాలతో హతమార్చడమే లక్ష్యంగా వున్నట్లు ఈ చర్యతో స్పష్టమవుతోంది.

## సౌదీ అరేబియా ఒయాసిస్సులో 4 వేల ఏండ్ల నాటి పట్టణం

సౌదీ అరేబియా వాయవ్య ప్రాంతంలోని ఓ అందమైన ఒయాసిస్సులో 4 వేల ఏండ్లనాటి పురాతన పట్టణాన్ని పురావస్తు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఖైబర్ ఒయాసిస్సు కింద కనుగొన్న ఈ పట్టణాన్ని అల్-నతాహ్‌గా పిలుస్తు న్నారు. అప్పటి ప్రజలు సంచార జీవనం నుంచి నగర జీవన శైలికి ఎలా మారారన్న దానికి ఈ పట్టణం అద్దం పడుతున్నది. ఫ్రెంచ్ పురావస్తు శాస్త్రవేత్త గుయిలౌమ్ చార్లక్స్ నేతృత్వంలోని బృందం ఈ పట్టణాన్ని కనుగొంది. 2.6 హెక్టార్లలో నిర్మించిన ఈ పట్టణంలో 14.5 కిలోమీటర్ల పొడవైన పటిష్టమైన గోడ కూడా ఉంది. 'పీఎల్‌వోఎస్ వన్' జర్నల్‌లో ప్రచురితమైన ఇటీవలి అధ్యయనం ప్రకారం ఈ గోడను నివాస ప్రాంతం చుట్టూ నిర్మించారు. ఈ పట్టణం కాంస్య యుగం ప్రారంభంలో అంటే క్రీస్తు పూర్వం 2400-2000 సంవత్సరం నాటిదిగా గుర్తించారు. అప్పటి నుంచి క్రీస్తు పూర్వం 1500 నుంచి 1300 సంవత్సరాల వరకు ఈ పట్టణం కొనసాగి ఉంటుందని చెప్తున్నారు. ఇక్కడ 500 మంది వరకు నివసించే వారని అంచనా వేస్తున్నారు.

## US ప్రతినిధుల సభకు ఎన్నికయిన ముగ్గురు ముస్లిములు


ముగ్గురు ముస్లిమ్ ప్రతినిధులు యూఎస్ హౌస్ ఆఫ్ రిప్రెజెంటేటివ్ కు ఎన్నికయ్యారు. వారిలో రషీదా త్లైబ్, ఇల్హాన్ ఒమర్ , ఆంద్రీ కార్సన్ యూఎస్ ఎన్నికల్లో తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. కాంగ్రెస్‌లోని ఏకైక పాలస్తీనియన్ అమెరికన్ అయిన డెమోక్రాటిక్ ప్రతినిధి రషీదా త్లైబ్ మిచిగాన్ యొక్క 12వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్‌లో నాల్గవ సారి విజయం సాధించారు. గత సంవత్సరం నుండి గాజా స్ట్రిప్‌లో కొనసాగుతున్న యుద్ధంలో ఇజ్రాయెల్‌కు అమెరికా సైనిక సహాయానికి వ్యతిరేకంగా నిలబడిన వారిలో ఆమె ఒకరు. కాంగ్రెస్‌లోని ఇద్దరు ముస్లిం మహిళల్లో మొదటి వ్యక్తి ఇల్హాన్ ఒమర్ మిడ్ వెస్ట్రన్ రాష్ట్రం మిన్నెసోటాకు ప్రాతినిధ్యం వహిస్తూ మూడోసారి గెలిచారు. ఒమర్ తన ఎన్నికల ప్రచారంలో కష్టపడి పనిచేసి తన విజయానికి కారకులయిన తన మద్దతుదారులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. "మా కష్టానికి తగిన విలువ దొరికింది. మేము 117,716 తలుపులు తట్టాము. 108,226 ఫోన్ కాల్స్ చేశాము. మంచి భవిష్యత్తు సాధ్యమని నమ్మే మనందరికీ ఈ విజయం ఒక నిదర్శనం. రాబోయే రెండేళ్లలో మీ అందరినీ గర్వపడే మంచి పనులు చేస్తాను" ఆమె సోషల్ మీడియాలో తన విజయానందాన్ని పంచుకున్నారు. ఇక డెమోక్రటిక్ ప్రతినిధి ఆంద్రీ కార్సన్ ఇండియానాలోని 7వ డిస్ట్రిక్ట్‌లో తిరిగి ఎన్నికయ్యాడు, అక్కడ అతను రిపబ్లికన్ జాన్ ష్మిత్జ్‌ను ఓడించాడు. మునుపటి ప్రతినిధి, అతని అమ్మమ్మ జూలియా కార్సన్ మరణం తర్వాత కార్సన్ 2008లో మొదటిసారి కాంగ్రెస్‌కు ఎన్నికయ్యారు.

# జవాబుదారీతనం ఉన్నతికి మార్గం

**షేక్ మౌలాలి**

**నిజాయితీ, అమానతుదారీతనం విశ్వాసులకు ఉండాల్సిన ఉత్తమ సుగుణాలు.** అవి వ్యక్తిత్వానికి విలువైన ఆభరణాలు. అందుకే ఇస్లాం ఈ సుగుణాలకు ఎంతో ప్రాధాన్యతను ఇచ్చింది. ఈ రెండు సుగుణాలకు విశాలమైన అర్థాన్ని ఇచ్చింది. ప్రతి మనిషి వారి బాధ్యతల విషయంలో నిజాయితీతో, అమానతు దారీతనంతో జవాబుదారీగా ఉండాలని చెప్పింది. నిజాయితీ ఒక తప్పనిసరి విధి. అమానతుదారీతనం ఒక గురుతరమైన బాధ్యత. ఇతరులు మనకు ఇచ్చిన ధనం లేదా వస్తువులు, చెప్పిన రహస్యాలను బహిర్గతం చేయకుండా ఉండటం, మనకు ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చడమే అమానతుదారీతనం. ఒక వ్యక్తి తనకు అప్పగించిన పని లేదా బాధ్యతను ఉత్తమ రీతిలో, అత్యంత సమర్థవంతంగా నిర్వర్తించడమూ అమానతుదారీతనంలో భాగమై ఉంటుంది. మనం ఏదైనా పని చేస్తున్నప్పుడు మన ప్రతిభను, సహజ నైపుణ్యాలను పూర్తి స్థాయిలో వినియోగించాలి. ఈ ఆచరణను నిస్సందేహంగా అమానతుదారీతనాన్ని పాటించినట్టు అవుతుంది. అందుకే అధికార పదవులను అమానతు దారీతనం, నిజాయితీ, యోగ్యత కలవారికి అప్పగించాలి.

సమాజంలో ఎప్పుడైతే నిజాయితీ అంతరించిపోతుందో, అప్పుడు ప్రళయం సంభవిస్తుందని దైవప్రవక్త(స) స్పష్టంగా పేర్కొన్నారు. కాబట్టి బాధ్యతాయుత ఉద్యోగం లేదా పదవిలో ఉన్న వ్యక్తులు చిన్న వస్తువును కూడా అన్యాయంగా ప్రజల నుంచి కానుకల రూపంలో తీసుకోకూడదు. అలా చేస్తే ప్రళయ దినాన అలాంటి వ్యక్తులు ఆ వస్తువులు తీసుకొని అల్లాహ్ ముందు హాజరై సంజాయిషీ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. అల్లాహ్ ప్రసాదించిన శక్తియుక్తులు, నైపుణ్యాలు, సంపద, సంతానం కూడా అమానతులుగానే పరిగణించబడతాయి. వాటిని అల్లాహ్ మార్గంలో వినియోగించాలి. ఇతరుల రహస్యాలు కూడా అమానతులే. సభలు, సమావేశాల్లో చర్చించి తీసుకొనే నిర్ణయాలను, రహస్యాలను ఎక్కడా బహిరంగపరచకూడదు. శత్రువులతో సైతం నిజాయితీగా, అమానతుదారీతనంగా వ్యవహరించడం ఉత్తమ నైతికతకు నిదర్శనమని ప్రవక్త తన ప్రవర్తన ద్వారా రుజువు చేశారు. నమ్మకంతో దాచమని ఇచ్చిన వస్తువు లేదా సంపద అన్నింటి కంటే పెద్ద అమానతు. అల్లాహ్ హక్కులను నిరంతరం నెరవేర్చే అమానతును పరిరక్షించడం మనుషులను దుర్గుణాల నుండి, అప్రతిష్ట నుంచి కాపాడుతుంది. విశ్వాసం ఉన్న వారిలోనే అమానతుదారీ తనం ఉంటుంది. అమానతు దారీతనం మనిషి వ్యక్తిత్వాన్ని అత్యంత శక్తిమంతంగా తీర్చిదిద్దుతుంది. కాబట్టి దాన్ని పాటించడంలో అలసత్వం, లోపం ప్రదర్శించకూడదని అల్లాహ్ హెచ్చరించాడు. అల్లాహ్ బోధనల ప్రకారం అమానతుదారీతనాన్ని ఆచరిస్తూ, నిజాయితీగా ఉంటూ మన జీవితాలను ఉన్నతంగా మలచుకొని ధన్యం చేసుకోవాలి.




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**